


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA

RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 20.12.2025 | సంపుటి : 2 | సంచిక :315 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Saturday | 20.12.2025 | volume : 2 | Issue : 315 | Pages : 8 | Cost : 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




## 74శాతం ఫిర్యాదులు పరిష్కరించాం

### ప్రజావాణితో సమస్యలకు పరిస్కారం

**రెండేళ్ల ప్రజావాణి వార్షికోత్సవంలో భట్టి**

ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందుకోసం తామంతా అహరహం శ్రమిస్తున్నామని అన్నారు. అలాగే సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లల్లో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు.

హైదరాబాద్, డిసెంబర్ 19 : బేగంపేట ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రజావాణి 2వ వార్షికోత్సవానికి భట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి -మిగతా 2 లో..

## సమస్యలపై వేగంగా స్పందించి.. చర్యలు తీసుకోవాలి

### ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట

**వికసిత భారత్ లక్ష్య సాధనలో సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకం**

**పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సులో రాష్ట్రపతి ముర్ము**

ఉద్యోగ నియామకాల విషయంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు వేగంగా స్పందిస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. 1950 తర్వాత యూపీఎస్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు మొదలైంది. ఈ విషయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కీలక పాత్ర పోషించారు. నియామకాల్లో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలి.





06

## బెట్టింగ్ యాప్ కేసు..

యువరాజ్ సింగ్, సోనూసూద్ ఆస్తులు అటాచ్



06

## ఢిల్లీకి రెడ్ అలర్ట్..

150కి పైగా విమాన సర్వీసులు రద్దు



## 41మంది మావోయిస్టుల లొంగుబాటు

**డిజిపి శివధర్ ఎదుట లొంగిన నక్సల్స్**

లొంగిన వారిలో రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి

కామారెడ్డికి చెందిన వ్యక్తిగా గుర్తింపు

హైదరాబాద్, డిసెంబర్ 19 : నిషేధిత మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 41 మంది మావోయిస్టు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో బటాలియన్, వివిధ డివిజనల్, ఏరియా కమిటీ స్థాయి నాయకులు కూడా ఉన్నారు. మొత్తం 24 ఆయుధాలు, 733 తూటాలు, 8 బీజీఎల్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం -మిగతా 2 లో..



02

## కొల్లాపూర్ సరిహద్దుల్లో పులి సంచారం

పాదముద్రలు గుర్తించిన అటవీ అధికారులు

అప్రమత్తంగా ఉండాలని గ్రామంలో చాటింపు



## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ప్రిపేర్ కండి

### పంచాయతీలకు సెలవ్.. పెట్టండి

**ఇక అన్ని ఎన్నికల్లో మనమే గెలవాలి**

**గులాబీ జెండాను హత్తుకున్న ప్రజలు**

**గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కేటీఆర్**

రాజన్నసిరిసిల్ల,డిసెంబర్19 : పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం సులభం కానీ.. పంచాయతీ ఎన్నికల్లో గెలవడం కష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ 10 సీట్లు గెలవలేదని.. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ 80 గ్రామాల్లో గెలిచిందని తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సమావేశమైన కేటీఆర్.. వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన -మిగతా 2 లో..

## బంగ్లాలో హిందూ వ్యతిరేక ఆందోళనలు

- దైవదూషణ పేరుతో హిందూ యువకుడి దారుణ హత్య
- సంతాపంతో సరిపెట్టిన అధ్యక్షుడు యూనస్



06

## ఎంపిలకు స్పీకర్ ఓంబిర్లా తేనీటి విందు

### సరదాగా ముచ్చటించుకున్న సభ్యులు

**హాజరైన ప్రధాని మోడీ, రాజ్‌నాథ్ సింగ్**

**ప్రధాని విదేశీ పర్యటనపై ప్రియాంక ఆరా**

న్యూఢిల్లీ, డిసెంబర్ 19 : పార్లమెంటు శీతాకాల సమావేశాలు మూడువారాల పాటు వాడివేడి చర్చలు, వాకౌట్లు, నిరసనల మధ్య ముగిసాయి. ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడటంతో సభలోని వాతావరణాన్ని తేలిక చేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శుక్రవారం ఉదయం ఎంపీలందరికీ తన నివాసంలో తేనేటి విందు ఇచ్చారు. -మిగతా 6 లో..



## నిజామాబాద్ జిల్లాలో దొంగనోట్ల కలకలం

### క్రాప్‌లోన్ కట్టేందుకు వెళ్లిన రైతు వద్ద దొంగనోట్లు

**మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో పంచినవిగా అనుమానం**

**పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ప్రారంభం**

నిజామాబాద్, డిసెంబర్ 19 : బ్యాంక్ రుణం కట్టేందుకు వచ్చిన వ్యక్తి దగ్గర అన్నీ దొంగనోట్లు ఉండడంతో అధికారులు ఖంగుతిన్నారు. వెంటనే పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. బ్యాంకులో పంట రుణం చెల్లించేందుకు -మిగతా 2 లో..





## ఫిల్మ్, టెలివిజన్ ఎకో సిస్టమ్ మరింత అభివృద్ధి

**ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణ**

02

**షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మంత్రి కోమటిరెడ్డి**

## వ్యవసాయ సహకార పాలకవర్గాల రద్దు

### గడువు ముగియడంతో ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, డిసెంబర్ 19 : తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్ల పాలక వర్గాలను రద్దు చేసింది. అలాగే తొమ్మిది జిల్లాల డీసీసీబీలను సైతం తొలగించింది. ఈ మేరకు ప్రభుత్వం -మిగతా 2 లో..





## ప్రజావాణితో సమస్యలకు పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి ఇన్‌ఛార్జి దివ్యదేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్దిదారుల తమ అనుభవాల పంచుకున్నారు. అంకితభావంతో సేవలు అందించి.. ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆక్షేపించారు. ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారానికి దూరమైన విపక్షం ఎన్ని విమర్శలు చేసినా.. తాము మరింత ముందుకు వెళ్తామన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో వనరులు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజావాణి విజయవంతం చేసిన చిన్నారెడ్డి, దివ్యాదేవరాజన్‌కు భట్టి అభినందనలు తెలిపారు.

# ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కారం అవసరం అని రాష్ట్రపతి అన్నారు. నియామకాల్లో పారదర్శకత, ప్రజల్లో విశ్వసనీయత పెంచడంపై దృష్టి సారించాలని పబ్లిక్ సర్వీస్ కమిషన్లకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు.నియామకాల్లో ఎదురవుతున్న సవాళ్లకు త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2047 వికసిత భారత్ లక్ష్య సాధనలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అలాగే నియామకాల్లో పారదర్శకత, నైతికత అవసరమని స్పష్టం చేశారు. నైపుణ్యాలు నేర్పవచ్చుని కానీ సమగ్రత లోపాన్ని మాత్రం భర్తీ చేయలేమన్నారు. టెక్నాలజీ సవాళ్లను ఎదుర్కొనేలా పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కమిషన్ చైర్మన్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్లు.. ఈ సదస్సుకు హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరీక్షల నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులు, పరస్పర సహకారంపై ఈ సదస్సులో చర్చించనున్నారు. సదస్సుకు హాజరైన రాష్ట్రపతి ముర్ముకు రామోజీ ఫిలిం సిటీలో ఘన స్వాగతం పలికారు. ఆమె వెంట తెలంగాణకు చెందిన పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మయూపీఎస్సీ చైర్మన్ అజయ్‌కుమార్, యూపీఎస్సీ కార్యదర్శి శశి




రంజన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సదస్సు శనివారంతో ముగియనుంది. ఈ సదస్సుకు భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరుకానున్నారు. అంతకుముందు బొల్లారం రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. దేశంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన ద్రౌపదీ ముర్ము.. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో రామోజీ ఫిల్మ్‌సిటీకి చేరుకున్నారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి సీతక్క ఉన్నారు. దేశంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించారు. సదస్సు అనంతరం సాయంత్రం రామోజీ ఫిల్మ్‌సిటీలో వివిధ ప్రదేశాలను ద్రౌపదీ ముర్ము సందర్శించారు.

## 41మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు ఉండటం గమనార్హం. పోలీసుల వివరాల ప్రకారం.. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్/కంపెనీ స్థాయి కమిటీ సభ్యులు, 12 మంది ఏరియా/ప్లాటూన్ కమిటీ సభ్యులు, 23 మంది సాధారణ పార్టీ సభ్యులు ఉన్నారు. ఇన్సాస్ ఎల్ఎంజీ, ఏకే47, ఎస్ఎల్ఆర్, ఇన్సాస్ రైఫిళ్లు, .303 రైఫిళ్లు తదితర ఆయుధాలు లొంగుబాటులో భాగంగా అప్పగించారు. మావోయిస్టు పార్టీలో సంస్థాగత బలహీనత, నాయకత్వంపై నమ్మకం తగ్గడం, అడవుల్లో తీవ్ర జీవన కష్టాలు, భద్రతా బలగాల ఒత్తిడి కారణంగానే తాము ప్రధాన జనజీవనంలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు లొంగిపోయిన మావోయిస్టులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుకు స్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి రాష్ట్ర పునరావాస విధానం ప్రకారం డివిజనల్ కమిటీ సభ్యులకు రూ.5 లక్షలు, ఏరియా కమిటీ సభ్యులకు రూ.4 లక్షలు, పార్టీ సభ్యులకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నారు. ఆయుధాలపై అదనపు రివార్డు కూడా ఇవ్వనున్నారు. మొత్తంగా రూ.1.46 కోట్లకు పైగా నగదు ప్రోత్సాహకాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లొంగుబాటుతో తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు మరింత బలహీనపడతాయని, మిగిలిన అజ్ఞాత కేడర్లు కూడా హింసను వీడి జనజీవనంలోకి రావాలని పోలీసులు పిలుపునిచ్చారు.నక్సలిజాన్ని రూపుమాపేందుకు, మావోయిస్టులను ఏరివేసేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఎంతోమంది మావోలు భద్రతబలగాల ఎన్ కౌంటర్ లో మృతిచెందారు. మరికొందరు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ క్రమంలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 40 మంది మావోయిస్టులు లొంగిపోయారు. డీజీపీ సమక్షంలో జనజీవన స్రవంతిలో మావోయిస్టులు కలిసిపోయారు.. లొంగిపోయిన వాళ్లలో ముగ్గురు రాష్ట్రస్థాయి లీడర్లు.. కొందరు హిడ్మా బెటాలియన్ కమాండర్స్ ఉన్నారు. లొంగిపోయిన వారిలో కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు డివిజన్ కమిటీ సభ్యులు, ఇద్దరు తెలంగాణ వాసులు ఉన్నారు. మిగతా మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారిగా డీజీపీ శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. మావోయిస్టుల వద్ద నుంచి 24 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు సెంట్రల్ విజన్ కమాండర్లు ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. తెలంగాణ పోలీసుల మేజర్ ఆపరేషన్ సక్సెస్ తో మావోయిస్ట్ పార్టీ కి మరో ఎదురు దెబ్బ తగిలిన్లట్లైంది.

## ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణ




**హైదరాబాద్, డిసెంబర్ 19 :** దేశంలోనే ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణను మార్చాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణలో ఫిల్మ్, టెలివిజన్ ఎకో సిస్టమ్‌ను మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. సులభంగా, సౌకర్యవంతంగా సినిమాల నిర్మాణానికి తెలంగాణ ఎంతో అనుకూలంగా మారిందన్నారు. సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు సహా పలువురు సినీ ప్రముఖులు, విశ్లేషకులతో కలిసి హైదరాబాద్ ప్రసాద్ ఐమ్యాక్స్‌లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ మొదటి ఎడిషన్‌ను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి వెంకట్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ - 2025.. మన హైదరాబాద్‌కు, మన తెలంగాణకు ఒక మంచి ఆరంభం అని పేర్కొన్నారు. హైదరాబాద్ అంటేనే సినిమాగా పేరుగాంచింద న్నారు. దేశం నలుమూలల నుంచి ఇక్కడికి వచ్చి సినిమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. పెద్ద సినిమాలు ఒకవైపు.. షార్ట్ ఫిల్మ్స్ మరోవైపు తీయడం వల్ల హైదరాబాద్ పేరు ప్రఖ్యాతలు మరింత పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. కొత్త టాలెంట్ ఎక్కువగా షార్ట్ ఫిల్మ్స్ నుంచి వస్తోందన్నారు మంత్రి. షార్ట్ ఫిల్మ్స్ యువతకు ఫ్రీడమ్ ఇస్తాయని.. కొత్తగా ఆలోచించడానికి.. కొత్తగా ట్రై చేయడానికి.. తమ కథని తమ స్టైల్‌లో చెప్పడానికి.. అవకాశాన్ని కల్పిస్తాయన్నారు కోమటిరెడ్డి. ఈరోజు పెద్ద స్థాయిలో ఉన్న చాలామంది ఫిల్మ్ మేకర్స్ మొదట షార్ట్ ఫిల్మ్స్‌తోనే మొదలుపెట్టారని గుర్తు చేశారు మంత్రి. సినిమాటోగ్రఫీ మంత్రిగా తాను ఒక విషయం స్పష్టంగా చెప్తున్నానని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సినిమా రంగానికి పూర్తి మద్దతుగా ఉంటుందని భరోసా ఇచ్చారాయన. 'మంచి టాలెంట్‌కు అవకాశం రావాలి.. యువ ఫిల్మ్ మేకర్స్ ముందుకు రావాలి.. వాళ్లకు సరైన ప్లాట్‌ఫామ్ ఉండాలి.. అదే మా ప్రభుత్వ ఆలోచన.' అని ఉద్ఘాటించారు మంత్రి కోమటిరెడ్డి. తమ లక్ష్యం చాలా సింపుల్ అని.. దేశంలోనే ఫిల్మ్ మేకర్స్‌కి బెస్ట్ స్టేట్‌గా తెలంగాణను మార్చాలన్నారు. అనుమతులు ఈజీగా ఉండాలి. సదుపాయాలు బాగుండాలి. అందుకోసం ప్రభుత్వం సీరియస్‌గా పని చేస్తోంది. ఈ ఫెస్టివల్‌లో నాకు ప్రత్యేకంగా నచ్చిన విషయం ఒకటి ఉంది. నార్త్ ఈస్ట్ రాష్ట్రాల నుంచి వచ్చిన ఫిల్మ్ మేకర్స్ పాల్గొనడం అని అన్నారు. ఎనిమిది రాష్ట్రాల కథలు ఇక్కడ మనం చూస్తున్నాం. హైదరాబాద్ అంటే మినీ ఇండియా. ఇలాంటి కార్యక్రమాలు మన దేశాన్ని ఇంకా దగ్గర చేస్తాయి. ఇక్కడ ఉన్న ప్రతి ఫిల్మ్ మేకర్‌కు నేను చెప్పదలుచుకున్నది ఒక్కటే. అవార్డు వచ్చినా రాకపోయినా.. మీ కథకి విలువ ఉంది. 15-20 నిమిషాల షార్ట్ ఫిల్మ్ కూడా మనసులను తాకగలదు. ధైర్యంగా కొత్త కథలు చెప్పండి. ముందుకు వెళ్లండి.' అంటూ యువ ఫిల్మ్ మేకర్స్‌లో ఉత్తేజాన్ని నింపారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. హైదరాబాద్‌లో ఇంటర్నేషల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించడం తెలంగాణకు మైలురాయిగా పేర్కొన్న మంత్రి కోమటిరెడ్డి.. యువ ప్రతిభావంతులను వెలికితీసేందుకు, కొత్త ఆలోచలనకు అంకురార్పణ చేసేందుకు లఘు చిత్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. సినిమాల్లో ప్రజల సంస్కృతి, జీవన విధానాన్ని ప్రతిబింబించాలని మంత్రి జూపల్లి.. ఔత్సాహిక దర్శక నిర్మాతలకు సూచించారు. కాగా, ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, ఎఫ్‌డీసీ ఎండీ సీహెచ్ ప్రియాంక, నిర్వాహకులు ఉమా మహేశ్వరరావు, ఇతర ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఎఫ్‌డీసీ, దాదా సాహెబ్ పాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్, తెలంగాణ టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఐమ్యాక్స్‌లో రేపు, ఎల్లుండి ఇంటర్నేషల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చిత్రాలను ప్రదర్శించనున్నారు. సుమారు 10 దేశాల నుంచి 700కుపైగా లఘు చిత్రాలు ప్రదర్శనకు రాగా.. వాటిలో ఉత్తమ చిత్రాలను జ్యూరీ సభ్యులు ఎంపిక చేసి ప్రదర్శించనున్నారు.



## కొల్లాపూర్ సరిహద్దుల్లో పులి సంచారం

**కొల్లాపూర్, డిసెంబర్ 19 :** కొల్లాపూర్ రేంజ్ సోమశిల సెక్షన్ సరిహద్దు గ్రామాలలోని ఎంగంపల్లి తండా గ్రామ పరిధిలో పెద్దపులి సంచారం కలకలం రేపుతుంది. సమాచారం అందిన వెంటనే జిల్లా అటవీ శాఖ ఉన్నతాధికారులు డీఎఫ్‌వో, ఎఫ్‌డీవో, ఎఫ్ఆర్‌వో ఆదేశాల మేరకు కొల్లాపూర్ అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఎంగంపల్లి తండా గ్రామ పరిసర ప్రాంతాలు, వ్యవసాయ పొలాలు, అటవీ సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు విస్తృతంగా పరిశీలనలు చేపట్టారు. ఈ పరిశీలన సమయంలో పొలాల్లో కనిపించిన పాదముద్రలు, ఇతర ఆనవాళ్లను సాంకేతికంగా పరిశీలించిన అనంతరం అవి పెద్దపులికి చెందిన జాడలేనని అటవీ శాఖ అధికారులు కాశన్న, ముజీబ్ ఘోరి నిర్ధారించారు. ఎంగంపల్లి తండాతో పాటు అటవీ సరిహద్దు గ్రామ సర్పంచ్ గోపి నాయక్ ఆధ్వర్యంలో గ్రామాలలో ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని చాటింపు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో పొలాల వద్ద ఒంటరిగా వెళ్లవద్దని, చిన్న పిల్లలను అటవీ ప్రాంతాల వైపు పంపవద్దని, గొర్లు, పశువులను కాపాడే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి కనిపించినా లేదా అనుమానాస్పద కదలికలు గమనించినా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఎవరు కూడా పంట పొలాల్లో ఉచ్చుళ్లు గాని, కరెంట్ గాని పెడితే అటవీ చట్టం 1972 ప్రకారం 10 సంవత్సరాల జైలు శిక్ష ఉంటుం దని తెలిపారు. ప్రజల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ కొల్లాపూర్ రేంజ్ అధికారి మక్దూం హుస్సేన్ స్పష్టం చేశారు.

## ఇక అన్ని ఎన్నికల్లో మనమే గెలవాలి


(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలు అయిపోయాయి కాబట్టి.. పగలు, పంచాయితీలో పక్కనబెట్టి కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల ప్రజలు గులాబీ జెండాను గుండెలను హత్తుకున్నారని కేటీఆర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కొన్ని చోట్ల రెండు వైపులా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే నిలబడ్డారని తెలిపారు. త్వరలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగబోతున్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీకి, మండల పరిషత్‌కు అనుసంధానకర్త ఎంపీటీసీ అని కేటీఆర్ తెలిపారు. అలాగే జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌కు సమన్వయకర్త జడ్పీటీసీ అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలతో పంచాయితీలు పక్కనపెట్టాలని సూచించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పల్లెపల్లెనా డంపింగ్ యార్డులు, ప్రగతి వనాలు ఏర్పాటు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పల్లెలు నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు.సిరిసిల్లలో ఉన్న 57 ఎంపీటీసీ స్థానాలు గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అందరూ కలిసి కాంగ్రెస్‌పై కొట్లాడాలన్నారు. గులాబీ గెలుపును చూసి కాంగ్రెస్ పరేషన్ అయితోందని తెలిపారు. ఓడిపోయిన అభ్యర్థులు కూడా ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీచేయాలన్నారు. పాత తరం నాయకులు, కొత్త తరాన్ని కలుపుకుంటూ ముందుకుపోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అప్పటికప్పుడు మాటలు మారుస్తున్నారని కేటీఆర్ అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మొదట 66 శాతం సర్పంచ్ స్థానాలు గెలిచామని చెప్పారని తెలిపారు. వెంటనే మాటమార్చి స్థానిక ఎన్నికలతో పార్టీకి సంబంధం లేదంటున్నాడని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి లాగే ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూడా మాటలు మారుస్తున్నారని అన్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్‌లో చేరానని కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. ఇప్పుడు మాటమార్చి బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెబుతున్నారని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని పరిస్థితిలో కడియం, పోచారం ఉన్నారని విమర్శించారు. గడ్డిపోచలాంటి పదవి కోసం చూరుకు గబ్బిలాల్లా వేలాడుతున్నారని ఎద్దేవా చేశారు.గెలుపు కోసం కాంగ్రెస్ ఎన్ని అరాచకాలు చేసినా ప్రజలు మాత్రం బీఆర్ఎస్‌తోనే ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో గులాబీ ప్రభంజనమే అందుకు నిదర్శనమని చెప్పారు. సర్పంచ్ అయినా ఎమ్మెల్యే, ఎంపీలు అయినా ప్రజల కోసమే పనిచేయాలని అన్నారు. ప్రతిపైసా ప్రజల కోసమే ఖర్చు పెట్టాలని సూచించారు. ఐదు అంచెల్లో ప్రభుత్వాన్ని ఎలా నడపాలో అంబేద్కర్ రాజ్యాంగంలో చెప్పారని గుర్తుచేశారు. కేంద్రం పైసలు ఇయ్యకున్నా.. రాష్ట్ర నిధులు ఉంటాయని తెలిపారు. గ్రామ పంచాయతీ నిధులు ఫైనాన్స్ కమిషన్ నుంచి వస్తాయని పేర్కొన్నారు. దాన్ని ఆపే హక్కు ఎమ్మెల్యేలకు లేదు.. సీఎం రేవంత్ రెడ్డికి కూడా ఉండదని స్పష్టం చేశారు.

## నిజామాబాద్ జిల్లాలో దొంగనోట్ల కలకలం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చిన నగదు పూర్తిగా దొంగ నోట్లుగా బ్యాంకు అధికారులు గుర్తించారు. రైతు తీసుకొచ్చిన రూ. 2,08,500 లలో అన్నీ రూ.500 నోట్లు నకిలీగా తేల్చారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బ్యాంకు అధికారులు వర్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లాలోని జలాల్పూర్ గ్రామానికి చెందిన రైతు నరెడ్ల చిన్నసాయిలు పంట రుణం చెల్లించేందుకు గురువారం సాయంత్రం వర్ని మండల కేంద్రంలోని కెనరా బ్యాంకుకు రూ. 2,08,500 తీసుకొచ్చాడు. ఈ క్రమంలో నగదును చెల్లించేందుకు క్యాష్ కౌంటర్‌లో ఇచ్చాడు. క్యాష్ కౌంటింగ్ యంత్రంలో నోట్లను లెక్కిస్తుండగా నకిలీ నోట్లు వచ్చాయి. అప్రమత్తమైన బ్యాంకు అధికారులు, సిబ్బంది డబ్బు ఎక్కడి నుంచి తెచ్చావని రైతును ప్రశ్నించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. రైతు తీసుకొచ్చిన రూ. 500 నోట్లను బ్యాంకు సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించగా.. అవన్నీ నకిలీ నోట్లేనని గుర్తించారు. నాలుగు రూ.500 నోట్ల కట్టలపై ఒక్కొక్క కట్టపై ఒకేరకమైన క్రమసంఖ్య ఉండటాన్ని గుర్తించారు. దీంతో నకిలీనోట్లని నిర్ధరించి గురువారం రాత్రి వర్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు అధికారి పంకజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నకిలీ నోట్ల వ్యవహారం వర్ని మండలంలో కలకలం సృష్టించింది. పరారీలో ఉన్న రైతు కోసం పోలీసు




లు గాలిస్తున్నారు. అయితే ఇదంతా మొన్నటి పంచాయితీ ఎన్నికల్లో పంచిన డబ్బుగా చర్చిస్తున్ఆరు. ఈజీగా డబ్బు సంపాదించేందుకు కొందరు కేటుగాళ్లు నకిలీ నోట్ల ప్రింటింగ్ కు పాల్పడుతున్నారు. దొంగనోట్లను ముద్రించి గుట్టుచప్పుడు కాకుండా చలామణిలోకి తీసుకొస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో జోరుగా దొంగ నోట్ల చలామణి అయినట్లు అధికారులు గుర్తించారు. రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. 417 రూ.500 నోట్లు నకిలీగా పోలీసులు తేల్చారు. కాగా ఇవే నోట్లను ఓ అభ్యర్థి సర్పంచ్ ఎన్నికల్లో ఓటర్లకు పంపిణీ చేసినట్లు తేలడంతో గ్రామస్థులు లబోదిబో మంటున్నారు. ఓటు వేసేందుకు నోటు తీసుకున్న వారిలో గుబులు మొదలైంది. స్థానిక ఎన్నికల్లో దొంగనోట్లు చలామణి కావడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## వ్యవసాయ సహకార పాలకవర్గాల రద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేసింది. ఈ డీసీసీబీల పాలకమండళ్ల కాలపరిమితి ముగియడంతో రద్దు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమించాలని వ్యవసాయశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ ఇన్‌ఛార్జిలు కొనసాగుతారని పేర్కొంది. ఈ ఏడాది ఆగస్టు 14వ తేదీతో పీఏసీఎస్‌ల పదవీకాలం ముగిసిందని ప్రభుత్వం వివరించింది. వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సహకార సొసైటీల నిర్వహణకు ఎన్నికల ద్వారా పాలకవర్గాలను నియమిస్తుంది. సొసైటీల సామర్థ్యాలకు అనుగుణంగా చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ఉంటారు. ఎన్నికైన పాలకవర్గాలు ప్రభుత్వం ద్వారా వ్యవసాయ, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి రైతుల సంక్షేమానికి అమలయ్యే పథకాలను అందిస్తాయి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఎన్నికల ద్వారా ఈ పాలకవర్గాలను ప్రభుత్వం నియమిస్తుంది. 2020, ఫిబ్రవరిలో కేసీఆర్ ప్రభుత్వం ఈ ఎన్నికలను నిర్వహించింది. ఈ ఎన్నికల ద్వారా పదవులు పొందిన వారి పదవి కాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసింది. వారి పదవి కాలాన్ని ఆరు నెలల పొడిగించింది. తాజాగా పాలకవర్గాలను రద్దు చేసింది.

# ప్రతి నియోజకవర్గానికి సాగునీరు

- వచ్చే జూన్ నాటికి సీతారామతో నీరు అందిస్తాం
- పాలేరుకు గోదావరి జలాలను రప్పించడమే లక్ష్యం
- జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసే సంకల్పంతో పనులు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి



**ఖమ్మం, డిసెంబర్ 19 :** ఖమ్మం జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రాబోయే జూన్ నాటికి 25 వేల ఎకరాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు నీరు అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. టన్నెల్స్ అన్నింటినీ శరవేగంగా పూర్తి చేసి అన్నదాతలకు సాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పుకొచ్చారు. పాలేరుకు గోదావరి జలాలు వస్తేనే సీతారామ లక్ష్యం పూర్తవుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు తుమ్మల. మరోవైపు స్వామి నారాయణ స్కూల్ నిర్మాణం జరుగుతోందని.. వెలుగుమట్ల అర్బన్ పార్క్ నిర్మాణం పూర్తి చేసి మంచి మ్యూజియం, పార్క్ ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాను అన్ని విధాలా నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి.. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న పనులను వివరించారు. పర్యాటక ప్రాంతంగా ఖమ్మంను అభివృద్ధి చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు మంత్రి. ప్రపంచస్థాయి డిజైన్‌తో నగరంలో క్రికెట్ స్టేడియం నిర్మాణం చేస్తున్నామని మంత్రి తుమ్మల వెల్లడించారు. సర్దార్ పటేల్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ పూర్తి కావొచ్చిందని వెల్లడించారు. ఖిల్లాకు రోప్ వే పనులు ప్రారంభమయ్యాయని.. జూన్ నాటికి మున్నేటిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం పూర్తి కావొచ్చిందని.. అలాగే శిల్పారామం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మెడికల్ కళాశాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఖమ్మంలో హరిత హోటల్ నిర్మాణం చేయబోతున్నామని చెప్పారు. 20ఎకరాలను టీటీడీకి అందజేస్తున్నా మని.. వారి ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ మిగిలిన అన్ని చెరువులకూ కృష్ణా జలాలు అందజేస్తున్నామని అన్నారు.



## క్రిస్మస్ వేడుకలకు సిఎంకు ఆహ్వానం

**హైదరాబాద్, డిసెంబర్ 19 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి అజారుద్దీన్, క్రిస్టియన్ మైనారిటీ నేతలు కలిసారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి అజారుద్దీన్, క్రిస్టియన్ మైనారిటీ నేతలు ఆహ్వానం అందించారు. ఏటా ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తోంది. మైనార్టీ శాఖ దీనిని చేపట్టింది.

## కట్టుకున్న భర్తే కాలయముడు

- ప్రేమించి పెళ్లి చేసుకుని కట్నం కోసం వేధింపులు
- దుడ్డుకర్రతో కొట్టి చంపిన దుండగుడు

**వికారాబాద్, డిసెంబర్ 19 :** వికారాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. ప్రేమించి పెళ్లాడిన వాడే ఆమె పాలిట కాలయముడయ్యాడు. పెళ్లయినప్పటి నుంచి అదనపు కట్నం కోసం చిత్రవధలకు గురిచేశాడు. చివరకు విచక్షణారహితంగా కొట్టి చంపేశాడు. ఈ దారుణ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. తాజాగా ఈ కిరాతకానికి సంబంధించిన వీడియో బయటకొచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని సాయిపూర్‌కు చెందిన పరమేశ్, అనూష (22) ప్రేమించుకున్నారు. పరమేశ్ పట్టుబట్టడంతో అతని తల్లిదండ్రులకు ఇష్టం లేకపోయినా సరే, 8 నెలల క్రితం పెళ్లి జరిపించారు. ప్రేమించి పెళ్లాడిన వ్యక్తితో సంతోషంగా గడపొచ్చని భర్తతో మెట్టింటికి అడుగుపెట్టిన అనూషకు నిరాశే ఎదురైంది. అత్తమామలతో పాటు భర్త నుంచి వరకట్న వేధింపులు మొదలయ్యాయి. కొద్దిరోజులుగా కట్నం కోసం వారు వేధింపులకు గురిచేశారు. వారం రోజుల క్రితం విచక్షణారహితంగా కొట్టారు. ఈ విషయం తెలిసిన అనూష తల్లి, సోదరుడి వరసయ్యే వ్యక్తి వచ్చి ఆమెను పుట్టింటికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయితే అనూషను మంచిగా చూసుకుంటానని చెప్పిన పరమేశ్.. గురువారం నాడు ఆమెను తీసుకుని ఇంటికి వెళ్లాడు. ఆ తర్వాత మరోసారి అనూషతో గొడవపడ్డాడు. ఆమెను తీవ్రంగా కొట్టాడు. దీంతో అనూష అపస్మారక స్థితిలోకి చేరుకుంది. ఇది గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అనూష మృతిచెందింది. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అనూషను పరమేశ్ ఇంటి బయట విచక్షణారహితంగా కొట్టడం అక్కడే సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.




## ఈవీలకు రూ.806 కోట్ల రాయితీ కల్పించాం

### విద్యుత్ వాహన తయారీ కంపెనీలతో మంత్రి పొన్నం

**హైదరాబాద్:** ఆర్థికంగా నష్టం కలుగుతున్నప్పటికీ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పడుతోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇప్పటివరకు 1,59,304 ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ)కు రూ. 806.35 కోట్ల రాయితీలు ఇచ్చామని, ప్రభుత్వ ఈవీ పాలసీని తయారీ కంపెనీలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లు, వాహనాల షోరూమ్‌ల దగ్గర ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచాలన్నారు. హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారుల కంపెనీలు, డీలర్లతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. రవాణా శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ ఇలంబర్తి, జేటీసీ రమేశ్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీల ప్రతినిధులు గోపాలకృష్ణ, సురేశ్‌రెడ్డి, గౌతంరెడ్డి హాజరయ్యారు. పొన్నం మాట్లాడుతూ... "ఈవీలు కొనేవారికి మొక్కను బహుమతిగా ఇచ్చి కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేయొచ్చు. తెలంగాణ విజన్–2047 నాటికి జీరో ఉద్గారాల లక్ష్యం, చర్యలు దేశానికి ఆదర్శంగా నిలుస్తాయి. ప్రభుత్వ శాఖలు, సంస్థలు కొనుగోలు చేసే కొత్త వాహనాల్లో 20% విద్యుత్‌వే ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జనవరిలో జరిగే రహదారి భద్రత కార్యక్రమానికి కంపెనీలు, డీలర్లు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి" అని సూచించారు.

## బ్యారేజీల ఈవోఐ టెక్నికల్ బిడ్స్ పరిశీలన

**హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు అర్హమైన సంస్థను ఎంపిక చేసేందుకు శుక్రవారం టెక్నికల్ బిడ్స్‌ను తెరిచారు. హైదరాబాద్ జలసౌధలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో) కార్యాలయంలో ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ– జనరల్) అంజద్ హుస్సేన్, సీడీవో సీఈ ఎంఎస్ రెడ్డి, రామగుండం సీఈ టి.శ్రీనివాస్ రావు గుప్తాలతో కూడిన కమిటీ ఈ ప్రక్రియను పర్యవేక్షించింది. ఆసక్తి వ్యక్తీకరణ పద్ధతిలో ఆర్వీ అసోసియేట్స్–ఐఐటీ మద్రాస్–ఐప్రిసస్, ఆఫ్రి ఇండియా, డీఎమ్మార్– ఆర్టీఎం–ఇంట్రాప్లాన్ సిగ్మా జేవీ సంస్థలు.. టెక్నికల్, ప్రైస్ బిడ్స్‌ను దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ సంస్థల సాంకేతిక అర్హతలను సీడీవో ఇంజినీర్లు పరిశీలించనున్నారు. అనంతరం సీడీవో విభాగం నివేదిక సమర్పించనుంది. తరువాత కమిటీ పరిశీలన చేసి ప్రైస్ బిడ్స్‌ను తెరవనుంది.

## నౌహీరా షేక్ ఆస్తుల వేలం ఆపొద్దు

### ఈడీకి సుప్రీంకోర్టు ఆదేశం

**ఢిల్లీ:** అధిక రాబడుల ఆశచూపి ప్రజల నుంచి కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించి మోసగించిన నౌహీరా షేక్ ఆస్తుల వేలాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కార్యక్రమానికి ఆమె అడ్డు తగులుతుంటే అరెస్ట్ చేసైనా వేలం ప్రక్రియ పూర్తి చేయాలని నిర్దేశించింది. ఈమేరకు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈడీని ఆదేశించింది. "ఆమె ఆస్తులను వేలం వేయాలని మేం ఇదివరకే స్పష్టం చేశాం. ఎలా ముందుకెళ్లాలన్నది మీ ఇష్టం. వేలం ప్రక్రియకు అడ్డు తగిలితే మీరు ఆమెను అరెస్ట్ కూడా చేయొచ్చు. ఇది పెద్ద స్కాం. ఈడీ ఆమె ఆస్తులను అటాచ్ చేసి వేలం వేయడానికి పూర్తి స్వేచ్ఛనిస్తున్నాం" అని జస్టిస్ పార్దీవాలా ఆదేశిస్తూ ఈ కేసు తదుపరి విచారణను మార్చికి వాయిదా వేశారు. మేం ఆమె పిటిషన్‌ను స్వీకరించి తప్పు చేశామని, తొలిరోజే డిస్మిస్ చేసి ఉంటే అన్ని సమస్యలూ తీరిపోయేవని న్యాయమూర్తి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.



## మెడికో విద్యారుణం కోసం ఇల్లు తాకట్టు

### మాజీ మంత్రి హరీష్ రావు పెద్దమనసు

**సిద్దిపేట, డిసెంబర్ 19 :** బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తన పెద్ద మనసును చాటుకున్నారు. పీజీ వైద్యవిద్య చదువుతున్న ఓ పేద విద్యార్థినికి రుణం కోసం తన ఇంటిని హామీగా పెట్టి రుణం ఇప్పించారు. విద్యార్థిని మమత చదువు కోసం ఏటా రూ. 7.50 లక్షలు చెల్లించాలని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఏదైనా ఆస్తి తనఖా పెడితేనే రుణం ఇస్తామని బ్యాంకర్లు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని హరీశ్‌రావు దృష్టికి మమత, ఆమె తండ్రి రామచంద్రం తీసుకెళ్లారు. దీంతో ఆయన సిద్దిపేటలోని తన ఇంటిని తనఖా పెట్టి రూ. 20 లక్షల విద్యారుణం ఇప్పించారు. విద్యార్థిని హాస్టల్ ఫీజు కోసం రూ.లక్ష నగదు అందజేశారు. హరీస్ రావు చొరవతో తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. ఆయనకు తమ కృతజ్ఞతలు తెలిపారు.



## మోండా మార్కెట్‌లో అగ్ని ప్రమాదం..

**సికింద్రాబాద్ :** రద్దీగా ఉండే సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. మోండా మార్కెట్‌లోని శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ అలముకోవడంతో మార్కెట్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించకుండా అదుపు చేశారు. అగ్ని ప్రమాదం జరిగిన దుకాణంలో ప్లాస్టిక్ వస్తువులు ఎక్కువగా ఉండటంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

# ఆస్ట్రేలియాలో ఉగ్రదాడికి.. హైదరాబాద్‌కు సంబంధం లేదు

**హైదరాబాద్:** ఇటీవల ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్‌లో జరిగిన కాల్పుల ఘటనపై తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి స్పందించారు. కాల్పులకు పాల్పడిన సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌కు చెందినవాడే అయినప్పటికే ఉగ్రఘటనతో హైదరాబాద్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు. 1998లో ఉపాధి కోసం ఆస్ట్రేలియా వెళ్లిన సాజిద్ అక్రమ్ ఆరు సార్లు భారతదేశానికి వచ్చాడన్నారు. ఆస్ట్రేలియాలోనే యురోపియన్ యువతిని పెళ్లి చేసుకున్న తర్వాత 1998లో భార్యతో పాటు ఒకసారి హైదరాబాద్‌కు వచ్చినట్లు తెలిపారు. 2004లో, 2009 ఫిబ్రవరిలో మరోసారి వచ్చాడన్నారు. 2011 జూన్‌లో, 2016లో ప్రాపర్టీ సెటిల్‌మెంట్ కోసం వచ్చాడని చెప్పారు. 2022లో చివరి సారిగా తల్లి, సోదరిని చూడటం కోసం వచ్చాడని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. బోండీ బీచ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 16 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.



## డిజిటల్ అరెస్ట్ కేసులో కాకినాడకు చెందిన ఇద్దరు అరెస్ట్

**కాకినాడ:** డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాకినాడకు చెందిన సూరంపూడి చంద్రశేఖర్, ఇమంది వెంకట్ నవీన్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు.. మరి కొందరు నిందితుల కోసం కోసం గాలిస్తున్నారు. ఇటీవల కాకినాడకు చెందిన విశ్రాంత ఉద్యోగికి వాట్సాప్ కాల్ చేసిన సైబర్ ముఠా.. డిజిటల్ అరెస్ట్ అంటూ భయపెట్టి రూ. 59లక్షలు వసూలు చేశారు. ఆర్టీజీఎస్ ద్వారా డబ్బులు బదిలీ చేయించుకున్న నిందితులు.. ఆ తర్వాత షెల్ కంపెనీ ఖాతాల ద్వారా క్రిప్టో కరెన్సీగా మార్చారు. బైనాన్స్ ద్వారా వ్యక్తిగత ఖాతాల్లోకి నగదు జమ చేసుకున్నారు. దేశవ్యాప్తంగా 65 సైబర్ కేసుల్లో నిందితుల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు వీరు.. సైబర్ మోసాల ద్వారా రూ. 8 కోట్లు కాజేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుల నుంచి 5 సెల్‌ఫోన్లు, 10 డెబిట్ కార్డులు, చెక్ బుక్స్, పాన్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరికొందరు నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## సుధామూర్తి పేర డీప్‌ఫేక్ వీడియో

### ఇలాంటి వాటిని చూసి మోసపోవద్దన్న సుధామూర్తి



**న్యూఢిల్లీ, డిసెంబర్ 19 :** రాజ్యసభ ఎంపీ సుధామూర్తి చెప్పినట్లుగా డీప్‌ఫేక్ వీడియో వైరల్‌గా మారింది. ఫలానా దాంట్లో పెట్టుబడులు పెట్టాలంటూ చేసిన వీడియో ప్రచారం ఆమె దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు. పలు సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని తాను సూచిస్తున్నట్లుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్న వీడియో ఫేక్ అని రాజ్యసభ ఎంపీ సుధా మూర్తి పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టాలని తాను ఎప్పుడూ చెప్పనని.. ఇటువంటి డీప్‌ఫేక్ వీడియోల మాయలో పడొద్దని ప్రజలకు సూచించారు. వైరలైన వీడియోలో అధిక రాబడులు పొందడానికి తాను సూచించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని సుధామూర్తి చెబుతున్నట్లు ఉంది. ఆయా సంస్థల్లో పెట్టుబడులు పెట్టడానికి స్క్రీన్‌పై కనిపిస్తున్న లింక్‌పై క్లిక్ చేయమని వీక్షకులను కోరుతున్నట్లు చూపిస్తోంది. ఇప్పటికే చాలామంది పెట్టుబడిదారులు ఇందులో చేరి, నెలకు రూ. 10 లక్షల వరకు సంపాదిస్తున్నారు. ఎక్కువ మంది దీనిలో చేరుతున్నందున రిజిస్ట్రేషన్లను నేటితో ముగిస్తున్నాం. అందుకే ఇందులో చేరాలనుకునేవారు వీడియో కింద కనిపిస్తున్న లింక్ ద్వారా వెంటనే చేరండని సుధామూర్తి చెబుతున్నట్లుగా ఉంది. ఈ వీడియోపై సుధామూర్తి స్పందిస్తూ..డీప్‌ఫేక్ వీడియోలపై ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎటువంటి పెట్టుబడులు పెట్టాలని ఎవరికీ సూచించనని.. ఇటువంటి వీడియోలు చూసి ఎవరూ మోసపోవద్దని కోరారు. వాటి వెనక ఉన్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదిలావుంటే ఇలాంటి వీడియోలు సందేశాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు.

## విశాఖలో ఘోర రోడ్డు ప్రమాదం

### ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో ముగ్గురు మృతి

**విశాఖపట్టణం, డిసెంబర్ 19 :** విశాఖ జిల్లాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పెందుర్తి సింహపురి కాలనీ బీఆర్టీఎస్ రోడ్డులో తీవ్ర విషాదం నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రోడ్డుప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ద్విచక్రవాహనంపై భార్య, కుమారుడితో వెళ్తున్న ఓ వ్యక్తి.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డివైడర్‌పై పడి అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన మహిళ, ఆరు సంవత్సరాల బాలుడిని కేజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. స్థానికుల సమాచారం మేరకు ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే, మృతిచెందిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు బాధితుల వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల్లో పదుల కొద్దీ ప్రాణాలు పోవడం ఆందోళన కలిగిస్తోంది.

## పండగ సీజన్‌తో ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, డిసెంబర్ 19 :** పండగ సీజన్ వచ్చేసింది. క్రిస్మస్, సంక్రాంతి పండగలకు స్కూళ్ల సెలవులు ఇప్పటికే ప్రకటించేశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వివిధ రైల్వే జోన్లలో ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ నడుపుతోంది. అయినా ప్రతియేడు రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతోంది. వీళ్లను దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 244 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే శాఖ తాజాగా ప్రకటించింది. రానున్న రోజుల్లో మరిన్ని రైళ్లను నడిపే అవకాశం ఉందంటూ రైల్వే మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. దేశవ్యాప్తంగా అత్యధిక డిమాండ్ ఉన్న ప్రధాన మార్గాల్లో ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని రైల్వే శాఖ తెలిపింది. ముంబై – నాగ్‌పూర్, పూణెళి – సంగానేర్ తదితర మార్గాల్లో అదనపు రైళ్లను నడుపుతోంది. ఢిల్లీ, హౌరా, లక్నో తదితర నగరాలను అనుసంధానించేలా ప్రత్యేక రైళ్లను నడపనుంది. అలాగే హైదరాబాద్, బెంగళూరు, మంగళూరు, ఇతర నగరాల మధ్య అదనపు రైళ్లు నడవనున్నాయి. తిరువనంతపురం, పూణెళి – సంగనేర్, నాగ్‌పూర్ తదితర మార్గాల మధ్య రైళ్లు నడుస్తాయి.

## రైతుకు మిల్లర్లు ఇచ్చింది నకిలీ నోట్లా?

### దర్యాప్తు చేపట్టిన పోలీసులు

నిజామాబాద్, డిసెంబర్ 19 : నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో దొంగ నోట్ల కలకలం రేగడంతో పోలీసులు రంగంలోకి దిగారు. పంట అమ్మగా వచ్చిన నగదును రైతు తీసుకున్నాడని తెలుస్తోంది. అయితే ఈ డబ్బు మిల్లర్ల నుంచి రైతుకు అందిందని అంటున్నారు. స్థానిక కెనరా బ్యాంక్‌లో పంట రుణం చెల్లించేందుకు రైతు తీసుకువచ్చిన నగదును దొంగ నోట్లుగా అధికారులు గుర్తించారు. రైతు తీసుకు వెళ్లిన రూ. 2,08,500 నగదు మొత్తం బ్యాంక్ అధికారులు నకిలీవిగా తేల్చారు. మొత్తం రూ. 500 నోట్లుగా గుర్తించారు. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన నరెడ్ల చిన్న సాయిలు గతంలో కెనరా బ్యాంకులో రుణం తీసుకున్నాడు. ఈ నగదు చెల్లించేందుకు గురువారం మధ్యాహ్నం కెనరా బ్యాంకులు వెళ్లాడు. కౌంటర్‌లో ఆ నగదును చెల్లించాడు. అనంతరం ఈ నగదును బ్యాంకు సిబ్బంది లెక్కిస్తుండగా.. అవి నకిలీ నోట్లుగా గుర్తించారు. ఈ విషయాన్ని బ్యాంక్ ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ నగదు ఎక్కడి నుంచి తీసుకు వచ్చావంటూ రైతు నరెడ్ల చిన్న సాయిలును బ్యాంకు అధికారులు, సిబ్బంది నిలదీశారు. దాంతో రైతు అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై పోలీసులకు బ్యాంకు సిబ్బంది ఫిర్యాదు చేశారు. రైతు కోసం పోలీసులు గాలిస్తున్నారు. అయితే ఇటీవల వర్ని మండలంలోఈ రైతు తన ధాన్యాన్ని మిల్లర్లకు బ్రోకర్ ద్వారా విక్రయించాడు. అతడికి వారు నగదు చెల్లించినట్లు సమాచారం అందుతుంది. చిన్న సాయిలు.. తన సోదరి ఇచ్చిన నగదు మొత్తం బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ నగదు ఒక్కడే ఇచ్చాడా? లేకుంటే వేర్వేరు ప్రాంతాల నుంచి తెచ్చాడా? అనేది తేలాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నకిలీ కుల ధృవీకరణతో ఎన్నిక

### సర్పంచ్‌పై చర్యకు కలెక్టర్‌కు ఫిర్యాదు

**కామారెడ్డి, డిసెంబర్ 19 :** తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయి.. ఆ వెంటనే ఫలితాలు సైతం వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో నకిలీ కుల ధృవీకరణ పత్రంతో సర్పంచ్ పదవికి ఎన్నికైనట్లు గ్రామస్తులు తాజాగా గుర్తించారు. దాంతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు వారంతా చేరుకుని ఆందోళన బాట పట్టారు. అతడిని సర్పంచ్ పదవి నుంచి వెంటనే తొలగించి.. మళ్లీ గ్రామ పంచాయతీ ఎన్నిక నిర్వహించాలంటూ కలెక్టరేట్ ఎదుట గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని రాజంపేట మండలం అన్నారం గ్రామం ఎస్టీ రిజర్వుడ్‌గా నిర్ణయించారు. ఈ గ్రామం నుంచి సర్పంచ్ అభ్యర్థిగా రవీందర్ బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో అతడు సర్పంచ్‌గా విజయం సాధించాడు. అయితే అతడు ఎస్టీ కాదని.. నకిలీ కుల ధృవీకరణ పత్రం ద్వారా ఈ ఎన్నికల బరిలో నిలిచినట్లు ఆ తర్వాత గ్రామస్తులు గుర్తించారు. దాంతో శుక్రవారం ఉదయం కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి గ్రామస్తులంతా చేరుకుని.. ఆందోళన చేపట్టారు. తప్పుడు కుల ధృవీకరణ పత్రం ద్వారా రవీందర్ ఈ ఎన్నికల బరిలో నిలిచి గెలిచారంటూ విమర్శించారు. అతడిని సర్పంచ్ పదవి నుంచి డిస్మిస్ చేసి.. గ్రామ పంచాయతీకి మళ్లీ ఎన్నిక నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలోని ఏవోకు అన్నారం గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు.

# ప్రజా సమస్యలపై పట్టింపు లేని సమావేశాలు!



**పార్లమెంట్ శీతాకాల సమావేశాలను కూడా మమ అనిపించారు. ఏ సమస్యపైనా సమగ్ర చర్చ జరగ కుండానే సాగాయి. ఈ సమావేశాల్లో కూడా అధికార ఎన్‌డిఎ కూటమిదే పైచేయిగా సాగింది. ఒకప్పుడు విపక్షాలది పైచేయిగా ఉండేది. విపక్షంలో అనుభవ రాహిత్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. డిసెంబరు 1న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తొలినాటి నుండి గందరగోళంగానే సాగాయి. అందుకే ప్రభుత్వంపై పైచేయి సాధించడంలో, ప్రజల పక్షాన కొట్లాడంలో విఫలం అయ్యారు. పార్లమెంటులో గొడవ పడడం, వాకౌట్ చేయడం, బయట ధర్నాలు చేయడం పరిపాటిగా మారింది. సమస్యలపై కేంద్రాన్ని నిలదీసే సత్తా ఉన్న నేతలు కానరావడం లేదు. అందుకే ప్రభుత్వం తాను కోరుకున్నట్లుగా వందేమాతరంపై చర్చించింది.**

ఎన్నికల సంస్కరణలపై తూతూమంత్రంగా చర్చ సాగింది. ఉపాధిహామీని రద్దు చేసి జీ రాం జీ బిల్లును ఆమోదించింది. ఢిల్లీ కాలుష్యంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. దీనిపై సమగ్రంగా చర్చించి, పరిష్కారం కనుగొనే ప్రయత్నం చేయడంలో అధికార, విపక్షం పూర్తిగా విఫలం అయ్యింది. ఇంతటి తీవ్ర సమస్యపై పార్లమెంటు సభ్యుల్లో అవగాహన కొరవడడం ప్రజల దురదృష్టం. ఇలాంటి వారు ఏ సమస్య పైనా సీరియస్‌గా చర్చిస్తారని అనుకోవడం బుద్ధి తక్కువే అవుతుంది. ఇక అన్నింటికి మించి పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న ప్రతి సందర్భం లోనూ ప్రధాని మోడీ విదేశీ పర్యటనలో ఉంటున్నారు. చర్చలో పాల్గొనడం, సమాధానం చెప్పడం అన్నది అరుదుగా కనిపిస్తోంది. అలాగే ప్రధాని తరవాత విపక్షనేత కూడా రాహుల్ జర్మనీ చెక్కేశారు. అసలు సమావేశాల సందర్భంగా ఇలాంటి పర్యటనలు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. ఇక కార్మిక చట్టాలపై సర్వత్రా వ్యతిరేకత వస్తోంది. ప్రధానంగా లెఫ్ట్ పార్టీలు వీటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దేశం ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలు పార్లమెంట్ సమావేశాల్లో కనీస ప్రస్తావనకు కూడా రాలేదు. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలవుతున్న రెండవ విడత ఓటర్ల జాబితా సవరణ పై ఎన్నికల సంస్కరణ పేరుతో చర్చించినా విపక్షాలు సఫలం కాలేదు. అనేక అంశాలను చర్చించాల్సి ఉన్నా కేవలం సర్‌పై మాత్రమే దృష్టి సారించింది. బీహార్ ఎన్నికల ఫలితాలను ఈ 'సర్' తలకిందులు చేసిందని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నా కనీస వివరణ ఇవ్వడానికి కూడా కేంద్రం సిద్ధం కాలేదు. రెండవ విడత సవరణ జరుగుతున్న రాష్ట్రాల్లో సుమారు 11 కోట్ల మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రతిపక్షాలు ఆందోళన చేయడమే తప్ప సూటిగా జరిగే తప్పులను లేవనెత్తలేక పోయారు.

ఎవరి ఓటు గల్లంతు అవుతుందో చెప్పడం లేదు. ప్రజాస్వామ్య సౌధానికి పునాది అయిన ఓటునే 'సర్' బీటలుబారుస్తుందనడం ద్వారా ఆరోపణలు చేయడం తప్ప ఆధారాలతో నిలదీయడంలో విపక్షం పూర్తిగా విఫం అయ్యింది. ఇకపోతే ఇప్పటి వరకు అమలులో వున్న కార్మిక, కర్షక చట్టాలు సమగ్రమైనవి, సర్వసమస్యలను పరిష్కరించేవి కాకపోయినా మార్పులు చేశారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించేశారు. కోట్ల మంది గ్రామీణ కూలీలకు 'పని' గ్యారంటీగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని పథకం పేరు మారింది. పనితీరు మారింది. నిధులు విడుదలా మారింది. దేశ సైనిక, ఆర్థిక రక్షణకు తోడ్పడిన అణు, బీమా రంగాల్లోకి నూరు శాతం విదేశీ పెట్టుబడుల ప్రవేశానికి అనుమతులు ఇచ్చే బిల్లులను ఆమోదించారు. సెల్‌ఫోన్‌ల ద్వారా వ్యక్తుల రహస్యాలను సేకరించేందుకు ఉద్దేశించిన 'సంచార్ సాథి' బిల్లును తీసుకురావడానికి ప్రయత్నించి, ప్రతిఘటనతో వెనక్కు తగ్గారు. 71 పాత చట్టాలను రద్దు లేదా సవరణ చేసే మరో బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. పార్లమెంట్ సమావేశాలకు కొద్ది రోజుల ముందు ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్లు, రక్షణ వైఫల్యాలు, ఉగ్రవాద నిర్మూలనకు కేంద్రం చేపడుతున్న చర్యల గురించి పార్లమెంట్‌కు చెప్పాల్సిన బాధ్యతను విపక్షంతో పాటు కేంద్రం కూడా విస్మరించింది. అలాగే 'వికసిత భారత్' రాజధాని ఢిల్లీలోని ఒకరోజు నివసిస్తే కాలుష్యం వల్ల 15 సిగరెట్లు కాల్చినంతగా ఆరోగ్యం చెడిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంతటి కాలుష్యానికి కారణాలు ఏమిటన్నదాని నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటో, ప్రజలు ఏమి చేయాలో పార్లమెంట్ సాక్షిగా ప్రభుత్వం చెబుతుందని ఆశించినవారికి నిరాశే మిగిలింది. డాలర్‌లో రూపాయి మారకం విలువ సుమారు 91 రూపాయలకు పడిపోయింది. దీనివల్ల ముడిచమురు ధరలు పెరిగి నిత్యావసర సరుకుల ధరలతో పాటు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడి, అదనపు నిరుద్యోగం పెరుగుతుంది.

ఇంతటి ముఖ్యమైన అంశం పార్లమెంట్‌లో ప్రస్తావనకుకూడా రాలేదు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ధిక్కరించి 5 వేల విమాన సర్వీసులను రద్దు చేసి దేశ ప్రతిష్టను దిగజార్చిన ప్రైవేట్ విమాన సర్వీసు 'ఇండిగో' గురించి, హెచ్1 బి వీసా, సుంకాల పెంపు, రష్యా చమురు దిగుమతులపై ఆంక్షలు విధిస్తున్న ట్రంప్ నిర్ణయాలపై చర్చ జరపకుండా ప్రజా సమస్యలను గాలికొదిలేశారు. ఇవన్నీ చర్చించేలా ఎజెండాను సెట్ చేయాల్సిన విపక్షనేతలు మరచి పోయారు. ఇవన్నీ కూడా చర్చించి, తద్వారా సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉంది. కానీ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ అనుభవ రాహిత్యం, ఆయన అనుచరుల వ్యూహాత్మక తప్పిదం కారణంగా అనేక సమస్యలు ఎప్పటిలానే వెనకబడి పోయాయి. ఇందుకు ప్రభుత్వాన్ని నిందించడం కన్నా చర్చను లేవనెత్తే విషయంలో విఫలం అయినందుకు విపక్షాన్ని దునుమాడాల్సిందే. అలాగే 1962 నాటి అణుశక్తి, 2010 నాటి పౌర అణు నష్టబాధ్యత చట్టాలను సవరిస్తూ ఈ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించారు. అణుశక్తి వంటి వ్యూహాత్మక, కీలక రంగంలోకి తమకిష్టమైన కార్పొరేట్ కంపెనీలకు అనుమతులు ఇచ్చి అణురక్షణ, దేశ భద్రతను ప్రమాదంలో వేశారు. కొత్త బిల్లు ప్రకారం అణు రియాక్టర్ల వల్ల ప్రమాదం జరిగినప్పుడు పౌరులకు చెల్లించాల్సిన నష్టపరిహారం యజమానుల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. ఉన్న చట్టాలే అమలు చేయని ఈ కంపెనీలు రానున్న రోజుల్లో ప్రజలకు ఏరకంగా బాధ్యత వహిస్తాయో పాలకులే చెప్పాలి.

## కొత్త ఎత్తులతో

# సైబర్ మోసాలు

- న్యూ ఇయర్ గిఫ్ట్, క్రిస్మస్ గిఫ్ట్ లింక్‌లను క్లిక్ చేయవద్దు
- అప్రమత్తంగా ఉండకుంటే అంతే సంగతులు
- హెచ్చరించిన సైబర్ పోలీసులు




**హైదరాబాద్, డిసెంబర్ 19 :** క్రిస్మస్ గిఫ్ట్, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు చేసే మోసాల బారిన పడవద్దని పోలీసులు హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మారుతున్న సమాజంలోని పరిస్థితులకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు వారి నేర విధానాన్ని మార్చుకుంటూ ప్రజలను మోసం చేయడానికి కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని ప్రజలను హెచ్చరించారు. పండుగ సీజన్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్ ఫారమ్‌లలో విపరీతమైన విక్రయాలు ప్రారంభమవుతాయని కొంత మందికి క్రిస్మస్ గిఫ్ట్ అంటూ, న్యూఇయర్ గిఫ్ట్ అంటూ వాట్సాప్ లేదా ఇమెయిల్‌లో సందేశాలతో లింక్ లు వస్తుంటాయని, ఆ లింక్ లను క్లిక్ చేసి మోసపోవద్దని, చిన్నగా 500 డాలర్లు గిఫ్ట్ కార్డ్‌ను గెలుచుకోండి అని మెసేజ్‌లు వస్తుంటాయని, ఆ లింక్ లపై క్లిక్ చేసిన తర్వాత దానితో ఓ లింక్ కూడా ఉంటుందని, దీనికి ఇచ్చే కాప్షన్ కూడా మిమ్ములను ఆ లింక్ క్లిక్ చేసే విధంగా పురిగొల్పుతుందన్నారు. కాబట్టి ఎలాంటి పరిస్థితిలలోను అపరిచితుల నుంచి వచ్చిన లింక్ లపై క్లిక్ చేయవద్దని, మీ వ్యక్తిగత సమాచారం పాన్‌కార్డు నంబర్, పాన్‌కార్డ్ ఫోటోలు అపరిచిత లింక్ లలో పంచుకోవద్దు అని సూచించారు. ఒకవేళ ఆ లింక్‌లో వివరాలు ఇస్తే మీ వ్యక్తిగత వివరాలు మీ ఫోన్ నంబర్ ఆధారంగా మీ బ్యాంక్ ఎకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ అవుతాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఒకవేళ ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే సంబంధిత మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు, మీ దగ్గర లోని పోలీసు స్టేషన్ నంబర్ కు గాని కాల్ చేయాలని, లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## ఆ ఐదు గ్రామాలను

# తెలంగాణలో కలపండి

- పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలి
- చంద్రబాబుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వినతి
- ప్రసాద్ స్కీంలో భద్రాచలానికి 200 కోట్లు విడుదల చేయండి
- కేంద్రాన్ని కోరిక కవిత



**భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 19 :** పరిపాలన సౌలభ్యం కోసం ఐదు గ్రామాలను భద్రాచలంలో కలపాలని ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. అలాగే అశ్వరావుపేట పెద్దవాగు ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు పూర్తి చేయాలని రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు వినతి చేశారు. ప్రసాద్ స్కీంలో భద్రాచలం రామాలయానికి రెండు వందల కోట్లు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసులు, గిరిజనుల సంక్షేమం కోసం చేసిన ఖర్చులపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క శ్వేతపత్రం విడుదల చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. జాగృతిబాటలో భాగంగా ఆమె జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ పాలనలో ఆదివాసులు, గిరిజనులకు ఏం చేశారో వెల్లడించాలన్నారు. సింగరేణి పుట్టినిల్లు ఇల్లందులో కొత్త బొగ్గు బావులు మొదలు పెట్టాలని అన్నారు. సింగరేణి కార్మికులు సంక్షేమం కోసం కాకుండా సీఎం రేవంత్ ఫుట్ బాల్ కోసం పది కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ముగ్గురు మంత్రులు ఉన్న జిల్లాలో కొత్తగూడెంకు ప్రాధాన్యం లేదని విమర్శించారు. ఒక మంత్రి కొత్తగూడెంను దత్తత తీసుకోవాలని.. కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు పెంచాలన్నారు. మణుగూరు ఓసీ 2 ప్రైవేటీకరణ అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు భద్రాద్రి జిల్లాలో పొలాలకు అందించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రాలో విలీనమైన ఎటపాక పురుషోత్తమ పట్నం, గుండాల, పిచుకులపాడు, కన్నాయిగూడెం గ్రామాలను భద్రాచలంలో కలపాలన్నారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. కొత్తగూడెంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులో గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. కొత్తగూడెం బైపాస్ రోడ్డు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆదివాసులు, గిరిజనులకు రిజర్వేషన్లు ఉన్నాయని వారిని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. సింగరేణి నిర్వాసిత గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు

**ప్రభాకర్ రావు కస్టోడియల్ పొడిగింపు**




**న్యూఢిల్లీ, డిసెంబర్ 19 :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరోవారం రోజుల పాటు పొడిగించింది సుప్రీం కోర్టు. డిసెంబర్ 25 వరకు కస్టోడియల్ విచారణ చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. గురువారం ప్రభాకర్ రావు వారం రోజుల కస్టోడియల్ విచారణ పూర్తి అయిన విషయం తెలిసిందే. అయితే ట్యాపింగ్ కేసులో మరికొన్ని రోజులు విచారణ చేయాలని సుప్రీంకోర్టును సిట్ కోరింది. వారం రోజుల కస్టోడియల్ విచారణ రిపోర్ట్‌ను ఉన్నత న్యాయస్థానానికి సిట్ అందజేసింది. దీంతో ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణను వారం రోజుల పాటు పొడిగింపుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 26న పోలీస్ కస్టడీ నుంచి ప్రభాకర్ రావును విడుదల చేయాలని.. తదుపరి విచారణ వరకు ఎలాంటి వ్యతిరేక చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునేందుకు, అవసరమైన మందులు తీసుకునేందుకు ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. కాగా.. కొత్త సిట్ ఏర్పాటుతో ట్యాపింగ్ కేసు మరింత వేగవంతంగా విచారణ జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. సీపీ సజ్జనార్‌తో పాటు రామగుండం సీపీ అంబరి కిషోర్ జా కూడా సిట్‌లో ఉన్నారు. గతంలో వెస్ట్ జోన్ డీసీపీగా ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిద్ధిపేట సీపీ విజయ్ కుమార్ కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మాదాపూర్ డీసీపీ రితి రాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డితో పాటు రవీందర్, వెంకట గిరి, కేఎస్ రావు, శ్రీధర్, నాగేందర్ రావుతో కొత్త సిట్ ఏర్పాటు అయ్యింది.

# ఐటి ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా

**రాయదుర్గలో భారీగా గంజాయి స్వాధీనం**

**హైదరాబాద్, డిసెంబర్ 19 :** రాష్ట్రంలో గంజాయి సరఫరాను అడ్డుకునేందుకు పోలీసులు అనేక రకాలుగా చర్యలు తీసుకుంటున్నారు. గంజాయిని అమ్ముతున్నా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట గంజాయి సరఫరా జరుగుతూ పట్టుబడటం పోలీసులకు సవాల్‌గా మారింది. తాజాగా నగరంలోని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐటీ ఉద్యోగులే టార్గెట్‌గా గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్ ఎస్వోటీ పోలీసులు.. గంజాయి సరఫరా చేస్తున్న సోహెల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని వద్ద నుంచి 17 కేజీల గంజాయి, 2 గ్రాముల ఎండీఎంఏ (ఓఆఓం) డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి గంజాయి తెచ్చి ఐటీ ఉద్యోగులకు నిందితుడు సోహెల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. సోహెల్‌తో పాటు గంజాయి వినియోగించిన ఐదు మంది కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## శ్రీశైలం పర్యటనలో ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్

**అమ్రాబాద్ వద్ద స్వాగతించిన కలెక్టర్, ఎస్పీలు**

**నాగర్‌కర్నూలు, డిసెంబరు 19 :** భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ హైదరాబాద్ చేరుకున్నారు. శ్రీశైలం వెళ్లే క్రమంలో నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ స్వాగతం పలికారు. శుక్రవారం భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కుటుంబ సమేతంగా కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుండి నేరుగా రోడ్డు మార్గాన శ్రీశైలం దర్శనానికి వెళ్తూ మార్గమధ్యంలో నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్ గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ టూరిజం మృగవాణి గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. భారతదేశ ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కు నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్, నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కాసేపు విరామం తర్వాత నేరుగా శ్రీశైలం దర్శనానికి బయలు దేరి వేళ్ళారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ నిరవధిక వాయిదా

**చివరిరోజు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండానేముగింపు**

**న్యూఢిల్లీ, డిసెంబరు 19 :** పార్లమెంటు శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. లోక్‌సభ, రాజ్యసభలు రెండూ నిరవధిక వాయిదా పడ్డాయి. ఉక్రవారం ఉదయంలోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే వందేమాతర గీతాలపన అనంతరం స్పీకర్ ఓంబిర్లా సభను నిరవధిక వాయిదా వేశారు. లోక్‌సభకు ప్రధాని నరేంద్రమోడీ కూడా హాజరయ్యారు. ఆయన కూడా వందేమాతర గీతాన్ని పాడారు. అలాగే రాజ్యసభ 11 గంటలకు ప్రారంభమైంది. సభకు ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ హాజరయ్యారు. యధావిధిగానే ఆయన టేబుల్‌పై పత్రాలు, ప్రకటనలు, నివేదిక సంబంధించినవి ఆయన టేబుల్‌మీద ఉన్నాయి. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ సభను నిరవధిక వాయిదా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నిన్న మంత్రి సమాధానం ఇచ్చే సమయంలో సభలో సభ్యుల ప్రవర్తనపై పునరాలోచించు కోవాలి. నిరసన వ్యక్తం చేయడం, కాగితాలను చింపివేయడం వంటివి సభకు తగనివి. సభ్యులు తమ ప్రవర్తనపై ఆలోచించుకోవాలి అని ఆయన అన్నారు. ఈ సెషన్ చాలా ఉత్పాదకంగా జరిగిందని, రాబోయే సెషన్లలో ఫలవంతమైన చర్చలు జరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయంలో నాణ్యతతో కూడిన చర్చలు చాలా విజయవంతంగా జరిగాయని ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ పార్లీమెంటు సమావేశాల్లో ప్రధానంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికున్న పేరును విబి–జి రామ్ జి బిల్లుగా తెచ్చిన సవరణ బిల్లును ప్రతిపక్ష ఎంపీల ఆందోళనల మధ్యే కేంద్రం ఆమోదింపజేసుకుంది.

# శబరిమల బంగారం మాయం కేసు

**ఈడీ దర్యాప్తునకు కేసు అప్పగింత**

**తిరువనంతపురం, డిసెంబరు 19 :** శబరిమల అయ్యప్ప దేవాలయంలోని బంగారు విగ్రహాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి దర్యాప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు కొల్లాం విజిలెన్స్ కోర్టు అనుమతిచ్చింది. సంచలనం రేపిన శబరిమల ఆలయంలోని విగ్రహాల బంగారు తాపడం బరువులో వ్యత్యాసం కేసుపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు చేస్తోంది. ఈ సమయంలో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ ఈడీ తొలుత కేరళ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సూచన మేరకు కొల్లాం విజిలెన్స్ కోర్టులో పిటిషన్ వేయగా.. కేంద్ర దర్యాప్తు బృందం విజ్ఞప్తిని సిట్ వ్యతిరేకించింది. ఒకేసారి రెండూ కొనసాగడం దర్యాప్తును ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడింది. అయినప్పటికీ విజిలెన్స్ కోర్టు మాత్రం ఈడీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సందర్భంగా కేసులో కీలక పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు సహా సంబంధిత దస్త్రాలను కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు నమోదైన రెండు ఎఫ్ఐఆర్ కాపీలు, ఇప్పటివరకు అరెస్టయిన ఏడుగురికి సంబంధించి సిట్ దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులు సహా ఇతర కీలక దస్త్రాలను ఈడీకి తక్షణమే ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. తద్వారా ఈడీ దీనిపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయనుందని సమాచారం. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు నమోదు చేయాలంటే పోలీసు డాక్యుమెంట్లు తప్పనిసరి అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో ఈడీ ఇప్పటికే ప్రాథమిక దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.



## మరణించిన భజన కళాకారుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** వైరా మండలం నారపనేనిపల్లి గ్రామానికి చెందిన భజన కళాకారుడు కడియాల రాజేశ్వరి (3473/13) శుక్రవారం ఆకస్మికంగా మరణించారు. అయన మృతి పట్ల భజన కళాకారుల సంఘం సంతాపం వ్యక్తం చేసింది. రాజేశ్వరి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ఆ భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని సభ్యులు ప్రార్థించారు. గ్రామీణ ప్రాంతాల్లో భజన సంస్కృతిని కాపాడేందుకు, కళాకారులను ఆదుకునేందుకు తిరుపతిలోని జానపద వృత్తి కళాకారుల సంఘం ఒక ప్రత్యేక సహాయనిధిని నిర్వహిస్తోంది. ఈ నిధిలో రాజేశ్వరి కేవలం 100 రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. సభ్యుడి అకాల మరణం సంభవించడంతో, సంఘం నిబంధనల ప్రకారం వారి కుటుంబానికి 5,000 రూపాయల తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షుడు తేజావత్ శివాజీ మార్గదర్శకత్వంలో, బృందం నాయకురాలు గారపాటి విజయలక్ష్మి రాజేశ్వరి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు పులిమామిడి యాదగిరి (తిరుపతి) మాట్లాడుతూ.. గ్రామాల్లో అంతరించిపోతున్న భజన సంస్కృతిని బతికించుకోవాలని, ఆధ్యాత్మిక ధర్మ ప్రచారాన్ని గ్రామం మూలమూలకు చేరవేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కళాకారులకు భరోసా కల్పించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని, ఈ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



## టిడబ్ల్యూజేఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** శనివారం ఉదయం 9గంటలకు ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో టి టి.డబ్ల్యూ.జే.ఎఫ్ మహాసభ విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారంనేలకొండపల్లి మండల కేంద్రంలో మండల యూనియన్ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో యూనియన్ నాయకులు ఎన్ డి.కర్ణ, పి.వి. నాగిరెడ్డి, కందికొండశ్రీనివాసరావు.మోరసైదులు, మారేపల్లిరామదాసు,పి. విద్యాసాగర్, కుక్కలఆదాం, నరేష్.తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేలకొండపల్లి మండలం నుంచి అత్యధిక సంఖ్యలో విలేకరులు సకాలంలో హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.



## నూతన సర్పంచ్‌కు ఘన సన్మానం

**వాజేడు, రాజముద్ర న్యూస్ :** మండల కేంద్రంలో పేరూరు గ్రామ పంచాయితీ నూతన సర్పంచ్ గొడ్డే సరోజినీ దేవి, కుమారుడు వార్డ్ మెంబర్ శరత్ ను యాదవ్ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సాలువతో సత్కరించి, ది గ్రేట్ లీడర్ లెజెండ్ అని ఫ్రేమ్ కట్టించిన ఫోటో అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, జీవన్,శశి, నరసింహారావు, చందు, శేఖర్, శ్రీకాంత్, శోభన్, కిచ్చాలు, నర్సింహులు, శ్రీను, సురేష్ పాల్గొన్నారు.



## తరుణ్ ఫౌండేషన్ సహకారంతో ఆర్థిక సహాయం అందజేత

**ఆత్మకూర్( ఎం).రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నటువంటి బొలుగుల బాలయ్య ని పరామర్శించిన తరుణ్ ఫౌండేషన్ అధినేత గుర్రం నరసింహులు సహకారంతో 5000/- రూపాయలు తాజా మాజీ జెడ్పిటిసి కోడిత్యాల నరేందర్ గుప్త , డైరెక్టర్ శ్రీ తండ నరసింహ గౌడ్ వారిని కలిసి పరామర్శించి ఆర్థిక సహాయం అందించడం జరిగింది.



## చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏబీవీపీ స్వచ్ఛ భారత్

**చేవెళ్ళ, రాజముద్ర న్యూస్: :** ఏబీవీపీ చేవెళ్ళ నగర శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్వ మహిపాల్ పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. ఆసుపత్రి ప్రాంగణంలో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. పరిశుభ్రత అలవాటుగా మారినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాటలు నిలబెట్టుకోండి

- ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు
- టెలికం అడ్వైజరీ కమిటీ డైరెక్టర్ షేక్ హిమాంసాబ్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి మండల పరిధిలోని అనాసాగరం గ్రామంలో నూతనంగా ఎన్నికైన పంచాయతీ పాలకవర్గ సభ్యులను శుక్రవారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ షేక్ మదర్ సాహెబ్ ఇంటి వద్ద ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు.ఖమ్మం జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ డైరెక్టర్.షేక్ ఇమామ్ సాహెబ్ స్వీట్లు తినిపించి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా షేక్ హిమాంసాబ్ మాట్లాడుతూ. గ్రామంలో ఎన్నికలప్పుడు మాత్రమే వేరువేరుగా ఉండాలని ఎన్నికల అనంతరం అందరూ ఒకటేనని. అందరూ కలిసికట్టుగా పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని హిమాం సాబ్ కోరారు.కార్యక్రమంలో అనాసగరం గ్రామపంచాయతీ సర్పంచ్ బొడ్డు రాంబాబు.ఉప సర్పంచ్ షేక్ మదార్ సాహెబ్, వార్డు సభ్యులు వంగూరు మౌనిక, కోడి నాగమణి, నోముల సైదమ్మ, ఎడ్ల తిరుపతిరావు, బొడ్డు మధు, బొడ్డు నాగమణి. నాగార్జున, రాయపాటి సిద్దు. సిపిఎం పార్టీ జిల్లా నాయకు. నాచేపల్లి సాగునీటి సంఘం మాజీ డైరెక్టర్ గుడవర్తి నాగేశ్వరరావు అనాసాగరం గ్రామ కాంగ్రెస్ నాయకుడు. తుమ్మలపల్లి వెంకటనారాయణ, నోముల వెంకటనారాయణ, అనాసగరం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్. మేళ్లచెరువు నాగేశ్వరరావు, షేక్ జాఫర్, షేక్ గోరి సాహెబ్, రేగళ్ల రామకృష్ణ దుబ్బాకుల రమేష్, కోడి రామకృష్ణ మరియు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాంక్టమ్ హెూమ్స్ యాజమాన్యంపై కార్మిక శాఖ వెంటనే చర్యలు తీసుకోవాలి

- చనిపోయిన కార్మికుడి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



**శంకర్‌పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి పట్టణ కేంద్రంలో శాంక్టమ్ అపార్ట్మెంట్స్ హెూమ్స్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మృతి చెందాడని తెలుసుకున్న సిఐటియు నాయకులు, శుక్రవారం రోజు ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళ్లి కార్మికులతో మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ... శంకర్ పల్లి పట్టణ కేంద్రంలో శాంక్టమ్ హెూమ్స్ కార్మికుల రక్షణ కోసం హెల్మెట్స్, సేఫ్టీ బెల్ట్, ఇతర పరికరాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదం జరిగిందా, మరోవిధంగా జరిగిందా అనే విషయంలో కార్మిక శాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టి శాంక్టమ్ హెూమ్స్ యాజమాన్యంపై కార్మిక చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకొని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కార్మిక శాఖ అధికారులను డిమాండ్ చేశారు. అలాగే అపార్ట్మెంట్స్ యాజమాన్యం చనిపోయిన కార్మికుని కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. శంకర్ పల్లి, మోకిల పరిధిలోని అపార్ట్మెంట్స్, విల్లాస్ యాజమాన్యాలు 1979 అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టానికి విరుద్ధంగా కార్మికులతో పని చేయిస్తు న్నారని, వారికి ఎలాంటి భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మోకిల, శంకర్ పల్లి పరిధిలో అనేక ప్రమాదాలు జరిగిన, కార్మిక శాఖ అధికారులు, ప్రభుత్వాధికారులకు చీమకుట్టినట్లయిన లేకపోవడం సిగ్గు చేటన్నారు. వెంటనే కార్మిక శాఖ అధికారుల స్పందించి శాంక్టమ్ హెూమ్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు శంకర్ పల్లి మండల కన్వీనర్ బోడ మల్లేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో క్రిస్మస్ సెలబ్రేషన్

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల్ మర్కల్ గ్రామం నందు ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి(మర్కల్) నందు సెమి క్రిస్టమస్ సెలెబ్రేషన్స్ ను చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా విద్యార్థులు క్రీస్తు ను గురించిన ఆట పాటలు, వాక్యం నృత్యాలతో ఆకట్టుకున్నారు. మరియు క్రీస్తు జననం ను గురించిన నాటకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ సి. హెచ్. మీనా, అకాడమిక్ కో ఆర్డినేటర్ కే. వనజ,



కల్చరల్ కమిటీ మెంబెర్స్ నేహా, నవనీత, షారోన్ లతో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులందరు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, కార్యక్రమన్ని విజయవంతం చేశారు.

## ఓటు వేలంపాట.. ప్రజాస్వామ్యానికి తాళం!

### సర్పంచ్ ఎన్నికల్లో డబ్బుల వర్షం, వ్యవస్థల మౌనం

**మానకొండూర్, డిసెంబర్ 19:** కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గంలో జరిగిన గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే స్థాయికి చేరుకున్నాయి. గ్రామాభివృద్ధి, ప్రజాసేవ అనే మాటలు ఎన్నికల ప్రచారంలో కనిపించకుండాపోయి, నగదు–మద్యం–మద్యం పంపిణీనే ప్రధాన అజెండాగా మారింది. ఇది ఎన్నిక కాదు బహిరంగంగా సాగిన ఓటు వేలంపాటే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ఓటు పవిత్రత పూర్తిగా తాకట్టు పడింది. ఒక్కో ఓటుకు రూ.500 నుంచి రూ.1500 వరకు నగదు, మద్యం, మాంసం పంపిణీ జరగగా, కొన్నిచోట్ల రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు బేరసారాలు సాగినట్లు బహిరంగంగానే చర్చ జరుగుతోంది. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రజల శక్తి అయితే, ఇక్కడ అది బేరం సరుకుగా మారిపోయిందన్న విమర్శలు తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి.

#### ఇజ్జత్ పేరుతో అప్పుల రాజకీయం

ప్రత్యర్థి ఎంత ఖర్చు పెడుతున్నాడో చూసి మరింతగా ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి అభ్యర్థులపై వచ్చింది. "ఇజ్జత్ కా సవాల్" అంటూ పొలాలు, బంగారం తాకట్టు పెట్టి మరీ డబ్బులు వెచ్చించారు. గెలుపు వస్తే పదవి ఓడితే జీవితాంతం అప్పుల భారం మోయాల్సిన దుస్థితికి అభ్యర్థుల కుటుంబాలు నెట్టబడ్డాయి. ఇది రాజకీయ పోటీ కాదు.. అప్పుల ఆత్మహత్యలకే బాట వేసే వ్యవస్థగా మారుతోందన్న ఆవేదన వ్యక్తమవుతోంది. ఓటింగ్‌కు రెండు రోజుల ముందే ఇంటింటికి మద్యం, మాంసం పంపిణీ జరగడం గ్రామాల్లో సాధారణంగా మారింది. అభివృద్ధి హామీలకు బదులు మద్యం సీసా, మాంసం ముక్క చేతిలో పెట్టి ఓటు అడగడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటుగా మారింది. సర్పంచ్ అభ్యర్థులే కాదు, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసినవారు కూడా ఇదే బాటలో నడవడం పరిస్థితి ఎంత దిగజారిందో స్పష్టం చేస్తోంది.

#### పార్టీల ప్రతిష్ఠ పేరుతో డబ్బుల మోత

స్థానిక సంస్థల ఎన్నికలను అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో గ్రామస్థాయిలో డబ్బుల ప్రవాహం పెరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ మద్దతుతో నిలిచిన అభ్యర్థులు గెలవాలనే ఉద్దేశంతో అనుచరులను రంగంలోకి దింపడమే కాకుండా, ఆర్థికంగా




చేయూతనిచ్చారని గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీ ఉనికి పేరుతో ప్రజాస్వామ్యాన్ని తాకట్టు పెట్టడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

#### ఎన్నికల యంత్రాంగం ఎక్కడ?

డబ్బులు, మద్యం పంపిణీపై బహిరంగంగా చర్చ జరుగుతున్నా, ఎన్నికల అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లే ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్లు, వీడియో నిఘా బృందాలు ఏమయ్యాయన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. ఎన్నికల నియమావళి కాగితాలకే పరిమితమైందా? లేక అధికారుల కళ్లముందే ఇవన్నీ జరిగాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సర్పంచ్ పదవితో వచ్చే అధికారాలు, వసతులు పరిమితమైనవే అయినా, రాజకీయ గొప్పల కోసం ఉద్యోగుల భార్యలను కూడా బరిలో నిలిపిన పరిస్థితులు కనిపించాయి. గతంలో అప్పుల నుంచి బయటపడలేక కొందరు సర్పంచ్‌లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన దుర్ఘటనలు ఉన్నప్పటికీ, అదే చరిత్ర మళ్లీ పునరావృతమవుతున్నది.

#### గెలిస్తే హంగామా.. ఓడితే నిస్సహాయత

తాజా ఎన్నికల్లో ఓడిన అభ్యర్థులు "లక్షలు ఖర్చు పెట్టారో చివరకు చేతిలో చిప్పలే మిగిలాయి" అంటూ లబోదిబోమంటున్నారు. అప్పుల వడ్డీలు, కుటుంబాలపై పడుతున్న ఒత్తిడి గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. మానకొండూరు నియోజకవర్గంలో జరిగిన ఈ ఎన్నికలు గ్రామ రాజకీయాల్లో డబ్బుల సంస్కృతి ఎంత ప్రమాదకరంగా మారిందో, ప్రజాస్వామ్యం ఏ స్థాయిలో దిగజారిందో ప్రశ్నిస్తోంది.



## ఉపాధ్యాయుల జిపిఎఫ్ అకౌంట్లను అప్డేట్ చేయాలి

**ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వివి నాయక్**

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగుల,ఉపాధ్యాయుల అకౌంట్లను వెంటనే అప్డేట్ చేయాలని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వివి నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల అకౌంట్ లను అప్డేట్ చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వివి అప్పారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు మాత్రమే అకౌంట్లను అప్డేట్ చేయడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు తమ కుటుంబాల అవసరాల కోసం, పిల్లల చదువులు, వివాహాలు తదితర అవసరాల కోసం లోన్లు పెట్టుకుంటే అకౌంట్లు అప్డేట్ కాని కారణంగా తక్కువ మొత్తంలో రుణాలు వస్తున్నాయని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరం వరకు అకౌంట్ లను వెంటనే అప్డేట్ చేసి, ఉద్యోగులు తమ జిపిఎఫ్ బ్యాలెన్స్ చూసుకునే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. ఈ అంశాల పై జెడ్పీ సీఈవో సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తొగరు రామయ్య, కస్తూరి కిషన్ ప్రసాద్, నరసింహస్వామి,రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## లిరాయిపల్లి గ్రామం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా

**సర్పంచ్ ఇంద్రాల అంజయ్య**



**ఆత్మకూరు (ఎం) రాజముద్ర న్యూస్: :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని రాయిపల్లి గ్రామ సర్పంచిగా ఇంద్రాల అంజయ్య కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సర్పంచ్ ఇంద్రాల అంజయ్య మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఏకగ్రీవంగా సహకరించిన నాయకులకు కార్యకర్తలకు గ్రామ ప్రజలకు ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడమే నా ప్రధాన లక్ష్యమని పదవి కోసం కాదని గ్రామన్నీ అభివృద్ధి చేయాలని సంకల్పంతో ముందుకు వచ్చానని అన్నారు గ్రామానికి నిస్వార్థంగా సేవ చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు జెట్ట ధనంజయ మాజీ సర్పంచ్ శ్రీశైలం, జెట్ట రవి,యూత్ కాంగ్రెస్ నాయకులు జెట్ట నవీన్ మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## శంకర్‌పల్లికి మూడు కొత్త రైళ్లు

**ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి కృషి**

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కుషి ఫలితంగా శంకర్ పల్లి రైల్వే స్టేషన్ కు మూడు కొత్త రైళ్ళు మంజూరయ్యాయని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రయాణికుల దృష్ట్యా ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి చొరవతో కేంద్ర రైల్వే మంత్రిని కోరగా వెంటనే స్పందించి ( హైదరాబాద్–విజయపుర), (రాయచూర్ – పర్భని), (పర్భని–రాయచూర్) మూడు రైళ్ళను ఆపే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. రైతుల సౌకర్యం కొరకు రైలు క్రాసింగ్ దాటడానికి ఇబ్బందులు పడుతున్నందుకు గాను కొండకల్ లో రైల్వే ఓవర్ బ్రిడ్జి, శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని ఫతేపూర్ లో 20 ఫీట్ల వెడల్పుతో అండర్ బ్రిడ్జి, నవాబు పేట్ మండల పరిధిలోని గొల్లగూడలో ఓవర్ బ్రిడ్జి, ముబారక్ పూర్ లో అండర్ బ్రిడ్జిలు మంజూరు అయ్యాయని తెలిపారు. నాయకులు, ప్రయాణికులు, మండల, మున్సిపల్ ప్రజలు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.




## శేరిగూడ ఎన్నికల అవకతవకలపై హైకోర్టులో పిటిషన్

**జనవరి 6కు విచారణ వాయిదా**

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండల పరిధిలోని శేరిగూడ గ్రామంలో జరిగిన రెండవ విడత స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న అవకతవకలపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు దాఖలైన డబ్ల్యూపీ నెం. 39201 / 2025 పిటిషన్‌ను హైకోర్టు విచారించి, తదుపరి విచారణను 2026 జనవరి 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది, పిటిషనర్ సమర్పించిన ప్రతినిధిత్వంపై ఇప్పటికే విచారణ ప్రారంభించామని కోర్టుకు తెలిపారు. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులకు వ్రాతపూర్వక ఆదేశాలు కూడా జారీ చేసినట్లు వివరించారు. అయితే, ఈ విచారణకు సంబంధించిన పూర్తి నివేదిక ఇంకా అందాల్సి ఉందని కోర్టుకు తెలియజేశారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న గౌరవనీయ న్యాయమూర్తి టిఎండి జస్టిస్, కేసును జనవరి 6వ తేదీన అడ్జర్న్ మోషన్ లిస్ట్‌లో లిస్ట్ చేయాలని ఆదేశించారు. విచారణ నివేదిక అందిన అనంతరం తదుపరి ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది.



## గ్రీన్‌కార్డ్ లాటరీ ప్రోగ్రామ్‌ను నిలిపేసిన ట్రంప్..

### కాల్పుల ఘటన ఎఫెక్ట్

**యూఎస్ :** గ్రీన్‌కార్డ్ లాటరీ ప్రోగ్రామ్‌ను నిలిపివేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల అగ్రరాజ్యంలో బ్రౌన్ యూనివర్సిటీలో కాల్పుల ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఆ కాల్పుల్లో ఇద్దరు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. పోర్చుగీస్ జాతీయుడైన నిందితుడు అమెరికాలోకి ప్రవేశించడానికి ఈ లాటరీ విధానం కారణమైందని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఈ మేరకు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ ప్రోగ్రామ్‌ను నిలిపివేయాలని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్‌ను ఆదేశించారు. "ఇలాంటి దారుణమైన వ్యక్తులను మన దేశంలోకి ఎన్నటికీ అనుమతించకూడదు" అని రాసుకొచ్చారు. డైవర్సిటీ వీసా ప్రోగ్రామ్‌నే గ్రీన్‌కార్డ్ లాటరీ ప్రోగ్రామ్‌గా పిలుస్తుంటారు. ఇమిగ్రేషన్ అండ్ నేషనాలిటీ యాక్ట్ కింద స్టేట్ డిపార్ట్‌మెంట్ ఈ డైవర్సిటీ వీసా ప్రోగ్రామ్ పనితీరును పర్యవేక్షిస్తుంది. దీనికింద ఏటా 55వేల వరకు గ్రీన్ కార్డులను అందుబాటులో ఉంచుతుంది. ఇతర దేశాల నుంచి అమెరికాకు వచ్చే జనాభాలో భిన్న జాతీయులు ఉండేలా దీనిని జారీ చేస్తుంటారు. ఈ వీసా ద్వారానే పోర్చుగీస్ జాతీయుడైన నిందితుడు అమెరికాలోకి ప్రవేశించాడు.



## భారత్‌తో బలమైన బంధానికి.. డిఫెన్స్ పాలసీతో ట్రంప్ ముందడుగు

**యూఎస్ :** భారత్‌తో సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి అమెరికా ముందడుగు వేసింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనాతో జరుగుతోన్న వ్యూహాత్మక పోటీలో ఆధిపత్యం పొందేందుకు.. క్వాడ్ కూటమి ద్వారా భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవాలన్న వార్షిక డిఫెన్స్ పాలసీ బిల్లుపై ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. దేశీయ, విదేశీ బెదిరింపుల నుంచి మాతృభూమిని రక్షించడానికి, రక్షణ పారిశ్రామికరంగ పునాదులను బలోపేతం చేయడానికి ఈ చట్టం వీలు కల్పిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌తో డిఫెన్స్ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లినప్పుడే ఇండో-పసిఫిక్‌లో చైనాపై ఆధిపత్యం సాధ్యమవుతుందని వెల్లడించారు. ప్రస్తుతం ట్రంప్ సంతకం చేసిన ది నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్ -2026లో భారత్‌తో డిఫెన్స్ రంగంలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం, క్వాడ్ ద్వారా స్వేచ్ఛాయుతమైన, బహిరంగ ఇండో-పసిఫిక్ ప్రాంత ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడం, చైనాతో వ్యూహాత్మక పోటీలో అమెరికా ప్రయోజనాలను పెంచడం వంటివి ఉన్నాయి. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఇరుదేశాలు సంయుక్త సైనిక విన్యాసాలలో పాల్గొనడం, రక్షణ వాణిజ్యం, విపత్తు సమయాల్లో మానవతా సాయం, సముద్ర భద్రత విషయంలో సహకారం వంటి ప్రయోజనాలు ఉండనున్నట్లు తెలుస్తోంది.




## సిడ్నీ ఉగ్రదాడి ఘటన..

### 'రియల్ హీరో' అహ్మద్‌కు భారీ నజరానా

**సిడ్నీ:** సిడ్నీలోని బోండీ బీచ్‌లో ఉగ్ర కాల్పుల ఘటనలో అహ్మద్ అల్ అహ్మద్ అనే వ్యక్తి ఉగ్రవాదులకు ఎదురొడ్డి ఎంతోమంది ప్రాణాలు కాపాడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న 'సిడ్నీ రియల్ హీరో'కు గో ఫండ్ మీ సంస్థ 2.5 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల (దాదాపు రూ.14 కోట్లు) చెక్కును అందించింది. ప్రపంచవ్యాప్తంగా 43వేల మంది దాతల నుంచి ఈ మొత్తాన్ని సేకరించారు. ఇందుకు సంబంధించిన చెక్కును తీసుకున్న అనంతరం అహ్మద్ మీడియాతో మాట్లాడుతూ సంతోషం వ్యక్తంచేశారు. మనుషులంతా ఒకరికొకరు తోడుగా ఉండాలని, ఇతరుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్న సమయంలో వారిని రక్షించడానికి శాయశక్తులా ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను ఎదుర్కొనే సమయంలో నిందితుడు.. అతడి చేతిపై పలు రౌండ్లు కాల్పులు జరపడంతో అహ్మద్ తీవ్రంగా గాయపడినట్లు ఆస్ట్రేలియన్స్ ఫర్ సిరియా అసోసియేషన్ ప్రతినిధి లుబాబా పేర్కొన్నారు. అతడి చికిత్సకయ్యే ఖర్చుల కోసం నిధులు సేకరిస్తున్నట్లు తెలిపారు.

## బ్యాంకు సిబ్బందే సొమ్ము దొంగలిస్తే..

**లఖ్‌నవూ:** ఆర్థికపరమైన లావాదేవీలకు బ్యాంకులు సురక్షితమని నమ్ముతుంటాం. కానీ, అక్కడి సిబ్బందే చేతివాటం ప్రదర్శిస్తే..?కంచే చేను మేసిన సామెతలా ఉంటుంది కదా. అచ్చం అలాంటి సంఘటనే ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ బ్యాంకులో జరిగింది. డబ్బు డిపాజిట్ చేసేందుకు ఓ కస్టమర్ రూ.100 నోట్ల కట్టను క్యాషియర్‌కు ఇవ్వగా.. అందులో కొన్ని నోట్లను అతడు పక్కకు తీశాడు. మిగిలిన వాటిని మాత్రమే లెక్కించి.. తక్కువగా ఉన్నాయని చెప్పి.. అంతే మొత్తాన్ని ఖాతాలో జమ చేశాడు. ఈ వ్యవహారమంతా అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డయింది. ఎలా బయటకు వచ్చిందో తెలియదుగానీ.. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. మరోవైపు సంబంధిత ఉద్యోగిపై బ్యాంకు యాజమాన్యం శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అతడిని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసినట్లు సమాచారం.

# బంగ్లాలో హిందూ వ్యతిరేక ఆందోళనలు

- దైవదూషణ పేరుతో హిందూ యువకుడి దారుణ హత్య
- సంతాపంతో సరిపెట్టిన అధ్యక్షుడు యూనస్




**ఢాకా, డిసెంబరు 19 :** బంగ్లాలో హిందూ వ్యతిరేక ఆందోళనలు మరోమారు ఉధృతం అయ్యాయి. ఈ క్రమంలో ఓ హిందూ వ్యక్తిని దుండగులు దారుణంగా చంపారు. ముఖ్యంగా, రాడికల్ శక్తులు హిందువులను దాడులకు పాల్పడుతున్నారు. ఇదిలా ఉంటే, మైమన్‌సింగ్ జిల్లాలో ఒక హిందూ వ్యక్తిని 'దైవ దూషణ' చేశాడనే ఆరోపణలో కొట్టి చంపడం సంచలనంగా మారింది. బాధితుడిని 30 ఏళ్ల దీపు చంద్ర దాస్‌గా గుర్తించారు. గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అతడిపై దాడి జరిగింది. అయితే, ఈ హింసపై బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనస్ స్పందించారు. మైమెన్సింగ్‌లో ఒక హిందూ వ్యక్తిని కొట్టి చంపిన సంఘటనను మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. న్యూ బంగ్లాదేశ్‌లో ఈ రకమైన హింసకు చోటు లేదు. ఈ క్రూరమైన నేరంలో పాల్గొన్న ఎవరినీ వదలబోము అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని తీవ్రవాద గ్రూపులు నిర్వహిస్తున్న హింస పట్ల అప్రమత్తంగా ఉండాలని తాత్కాలిక ప్రభుత్వం ప్రజలను కోరింది. హింస, భయం, దహనం, విధ్వంసం వంటి చర్యలను ఖండిస్తున్నట్లు పేర్కొంది. బంగ్లాదేశ్ కీలకమైన సమయంలో చారిత్రాత్మక ప్రజాస్వామ్య పరివర్తన గుండా వెళ్తోందని, గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నాలను సృష్టించి దేశం అశాంతి వైపు ప్రయణించడాన్ని అనుమతించబోమని హెచ్చరించారు. షేక్ హసీనా అవామీ లీగ్ ప్రభుత్వాన్ని కూల్చివేయడంలో కీలక పాత్ర పోషించిన, భారత వ్యతిరేకిగా పేరుగాంచిన విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదిని కొన్ని రోజుల క్రితం ఢాకాలో గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి వెళ్లారు. ఆయన తీవ్ర గాయాలపాలై చికిత్స తీసుకుంటూ మరణించాడు. మరోవైపు, రాడికల్ శక్తులు బంగ్లాలోని మీడియా సంస్థలైన ది డైలీ స్టార్, ప్రొథోమ్ అలోలపై దాడులు జరిగాయి. ఈ సమయంలో ప్రభుత్వం మాట్లాడుతూ.. తాము జర్నలిస్టులతో ఉన్నామని, ఉగ్రవాదం, హింసకు తీవ్రంగా క్షమాపణలు చెబుతున్నామని పేర్కొంది.

## జర్నలిస్టులకు క్షమాపణలు చెప్పిన యూనస్ ప్రభుత్వం



**ఢాకా, డిసెంబరు 19 :** విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీ మృతితో బంగ్లాదేశ్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం స్పందించింది. ఆందోళనకారులు సంయమనం పాటించాలని, హింసకు దూరంగా ఉండాలని అభ్యర్థించింది. అలాగే జర్నలిస్టులకు క్షమాపణలు చెప్పింది. హిందూ వ్యక్తిపై జరిగిన మూకదాడిని తీవ్రంగా ఖండించింది. ది డైలీ స్టార్, న్యూ ఏజ్, ప్రోథోమ్ అలో వంటి మీడియా సంస్థల కార్యాలయాలను ఆందోళనకారులు ధ్వంసం చేయడమే గాకుండా వాటికి నిప్పంటించారు. దాంతో కొందరు జర్నలిస్టులు అగ్నికీలల్లో చిక్కుకుపోయారు. తర్వాత వారిని కాపాడారు. దుండగులతో మాట్లాడేందుకు ప్రయత్నించిన న్యూఏజ్ పత్రిక ఎడిటర్ నూరుల్ కబీర్‌పై దాడి జరిగింది. దీంతో బంగ్లాదేశ్‌లో ప్రధాన పత్రికలు శుక్రవారం తమ కార్యకలాపాలను సస్పెండ్ చేశాయి. "ది డైలీ స్టార్, న్యూ ఏజ్, ప్రోథోమ్ అలో పాత్రికేయులకు మేం అండగా నిలుస్తాం. మీరు ఎదుర్కొన్న హింసపై తీవ్రంగా చింతిస్తున్నాం. ఈ హింసను ఎదుర్కొనే క్రమంలో మీరు చూపిన ధైర్యాన్ని ఈ దేశం చూసింది. మీకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నాం" అని ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ ఘర్షణల్లో ఒక హిందూ వ్యక్తి మూక హత్యకు గురయ్యాడు. దైవదూషణకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ కొందరు వ్యక్తులు అతడిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను బంగ్లాదేశ్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇలాంటి హింసాత్మక ఘటనలకు తావు లేదని, దాడికి పాల్పడిన వారిని ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టంచేసింది. మరోవైపు దాడుల కారణంగా తమ సేవలను తాత్కాలికంగా నిలిపివేసినందుకు ది డైలీ స్టార్ క్షమాపణలు తెలియజేసింది.

## అమెరికా బాటలోనే ఈయూ..

### భారత్ శరణార్థుల సంఖ్యలో కోత



**ఐరోపా :** శరణార్థుల విషయంలో అమెరికా బాటలోనే ఐరోపా సంఘం నడుస్తోంది. భారత్ సహా ఏడు దేశాల నుంచి వచ్చే శరణార్థుల అభ్యర్థనలను తక్కువగా తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలో భారత్‌తో పాటు బంగ్లాదేశ్, కొలంబియా, ఈజిప్ట్, కొసావో, మొరాకో, ట్యునీషియా ఉన్నాయి. ఈ దేశాలను సురక్షిత దేశాలుగా పరిగణిస్తూ ఈ మేరకు నిర్ణయించింది. దీనిపై మానవ హక్కుల సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సాయుధ ఘర్షణల వంటి సందరాల్లో విచక్షణారహిత హింస చోటుచేసుకోని దేశాలను తాము సురక్షితమని భావిస్తున్నట్లు ఐరోపా వెల్లడించింది. ఈ మేరకు ఐరోపా పార్లమెంట్, యూరోపియన్ కౌన్సిల్ మధ్య జరిగిన ఒప్పందం వెల్లడి చేస్తోంది. ఈ నిబంధన తమకు వర్తించదని దరఖాస్తుదారులు నిరూపించుకోవాల్సి ఉంటుంది. 2026 జూన్ నుంచి అమల్లోకి రానున్న ఈ ఒప్పందాన్ని రానున్న రోజుల్లో ఇతర దేశాలకు విస్తరించనున్నారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత ఆయా దేశాలు సురక్షితమని భావిస్తే తిరిగి ఈ శరణార్థులను వారి దేశాలకు పంపించే అవకాశం ఉంది. అయితే శారీరక హింసకు గురయ్యే ప్రమాదం ఉన్నవారిని మాత్రం తిరిగి వారి దేశాలకు పంపకుండా మినహాయింపు ఇవ్వనున్నారు. వలసదారులపై కఠిన విధానాలు అమలుచేస్తోన్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కూడా శరణార్థులకు ఇచ్చే వర్క్ పర్మిట్ కాలవ్యవధిని కుదిస్తున్నట్లు యూఎస్ సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్ ఇటీవల ప్రకటనలో తెలిపింది. శరణార్థులు, ఆశ్రయం పొందాలనుకునేవారు, గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నవారికి అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ కార్డ్ కింద అనుమతులు జారీ చేస్తారు. దీనికి అయిదేళ్ల కాలవ్యవధి ఉండేది. ఈ సవరణలతో దాన్ని 18 నెలలకు కుదించారు. భద్రతా కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు యూఎస్‌సీఐఎస్ తెలిపింది.

## చాయ్ పే చర్చ.. పాల్గొన్న ప్రధాని మోదీ, ప్రియాంకా గాంధీ



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నేటితో ముగిశాయి. ఈ సమావేశాల నిరవధిక వాయిదా తర్వాత స్పీకర్ ఓం బిర్లా ఎంపీలకు తేనీటి విందు ఇచ్చారు. ఇందులో ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, పలువురు అఖిలపక్ష ఎంపీలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రియాంక నియోజకవర్గం వయనాడ్ గురించి మోదీ చర్చించినట్లు తెలుస్తోంది. ఈసందరరేగా ప్రియాంక మాట్లాడుతూ వయనాడ్ అడవులలో దొరికే ఓ మూలికను వాడుతున్నానని.. దానివల్ల తనకు అలర్జీ సమస్యలు పూర్తిగా నయమయ్యాయన్నారు. ఏడాదిలో 125 రోజుల పాటు పని కల్పించే 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీ-జీ రామ్ జీ) బిల్లును గురువారం అర్ధరాత్రి ఆమోదించిన విషయంపై అఖిలపక్ష ఎంపీలు ప్రధానితో చర్చించారు. అర్ధరాత్రి చట్టాన్ని ఆమోదించడం ఆదర్శవంతంగా ఉండదని.. కాబట్టి శీతాకాల సమావేశాలను పొడిగించి ఉండాల్సిందని ప్రధానితో అన్నారు. అయితే ఈ బిల్లుపై ప్రతిపక్షాలు తరచూ నిరసనలు చేపట్టడం వల్ల పార్లమెంట్ సమావేశాల్లో అంతరాయాలు ఏర్పడ్డాయని.. అరిచీ, అరిచీ వారి గొంతులు అలసిపోవద్దని తాను కోరుకుంటున్నానని మోదీ సరదాగా వ్యాఖ్యానించడంతో అక్కడి నేతలు చిరునవ్వులు చిందించారు.



## బెట్టింగ్ యాప్ కేసు..

### యువరాజ్ సింగ్, సోనూసూద్ ఆస్తులు అటాచ్

**న్యూఢిల్లీ :** బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, బాలీవుడ్ నటులు సోనూసూద్, నేహాశర్మ ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. ఆ జాబితాలో నటి ఊర్వశీ రౌతేలా తల్లితో పాటు టీఎంసీ మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి, అంకుశ్ హజ్రా (బెంగాలీ నటుడు) కూడా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు సంస్థ వీరిని ఇప్పటికే విచారించగా.. తాజాగా అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.7.93 కోట్లని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గతంలో మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌కు చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరు మాజీ క్రికెటర్లు అన్ని విషయాలు తెలిసే ప్రమోషన్ కోసం విదేశీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారని గుర్తించింది. ఈ నేపథ్యంలోనే శిఖర్ ధావన్‌కు చెందిన రూ.4.5 కోట్ల స్థిరాస్తిని, సురేశ్‌కు చెందిన రూ.6.64 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్‌లను సీజ్ చేసేందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పార్లమెంట్ వేదికగా రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగ్‌ను బ్యాన్ చేసిన సంగతి తెలిసిందే.




## శబరిమల బంగారం చోరీ కేసు

### ఈడీకి అప్పగింత

**తిరువనంతపురం:** శబరిమల అయ్యప్ప దేవాలయంలోని బంగారు విగ్రహాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి దర్యాప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు కొల్లాం విజిలెన్స్ కోర్టు అనుమతిచ్చింది. ఈ సందరరేగా కేసులో కీలక పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు సహా సంబంధిత దస్త్రాలను కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు నమోదైన రెండు ఎఫ్ఐఆర్ కాపీలు, ఇప్పటివరకు అరెస్టైన ఏడుగురికి సంబంధించి సిట్ దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులు సహా ఇతర కీలక దస్త్రాలను ఈడీకి తక్షణమే ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. తద్వారా ఈడీ దీనిపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయనుందని సమాచారం. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇనార్మేషన్ రిపోర్టు నమోదు చేయాలంటే పోలీసు డాక్యుమెంట్లు తప్పనిసరి అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో ఈడీ ఇప్పటికే ప్రాథమిక దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. సంచలనం రేపిన శబరిమల ఆలయంలోని విగ్రహాల బంగారు తాపడం బరువులో వ్యత్యాసం కేసుపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు చేస్తోంది. ఈ సమయంలో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ ఈడీ తొలుత కేరళ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సూచన మేరకు కొల్లాం విజిలెన్స్ కోర్టులో పిటిషన్ వేయగా.. కేంద్ర దర్యాప్తు బృందం విజ్ఞప్తిని సిట్ వ్యతిరేకించింది. ఒకేసారి రెండూ కొనసాగడం దర్యాప్తును ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడింది. అయినప్పటికీ విజిలెన్స్ కోర్టు మాత్రం ఈడీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



## ఢిల్లీకి రెడ్ అలర్ట్..


### 150కి పైగా విమాన సర్వీసులు రద్దు

**న్యూఢిల్లీ :** ఉత్తర భారతాన్ని పొగమంచు కప్పేసింది. దాంతో శుక్రవారం ఉదయం 100 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో దిల్లీకి భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని హెచ్చరించింది. దానికి తగ్గట్టే 150కి పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరో 200 సర్వీసుల్లో జాప్యం చోటుచేసుకుంది. ఈ అంతరాయాలు కొనసాగుతాయని దిల్లీ ఎయిర్‌పోర్ట్ వెల్లడించింది. పంజాబ్, హరియాణా, దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాలను దట్టమైన పొగమంచు కప్పేసిందని, ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఉదయం 5.30 గంటల సమయంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా, బరేలీ, షహరాన్‌పుర్, గోరఖ్‌పుర్, పంజాబ్‌లోని అంబాలా, అమృత్‌సర్, లూథియానా, ఆదంపుర్, దిల్లీలోని సఫ్దర్‌జంగ్, హరియాణా, మధ్యప్రదేశ్, బిహార్‌లోని పలు ప్రాంతాల్లో ఎదురుగా వస్తోన్న వాహనాలు ఏమాత్రం కనిపించని పరిస్థితి నెలకొంది. కాగా.. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు దిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన చర్యలు అమల్లోకి వచ్చాయి. కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం (పీయూసీ) లేని వాహనాలకు దిల్లీ పెట్రోలు స్టేషన్లలో ఇంధనం అందించడం ఆపేశారు. ఈ నిబంధనలను కఠినంగా అమలుచేసేందుకు దిల్లీ సరిహద్దుల వద్ద పోలీసు, రవాణాశాఖ బృందాలను మోహరించారు.

# నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్

**ముంబయి: దేశీయ** స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాల కారణంగా సూచీల నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. అమెరికాలో అంచనాల కంటే తక్కువ ద్రవ్యోల్బణం నమోదు కావడం.. ఫెడరల్ రిజర్వ్ మరోసారి వడ్డీ రేట్లు తగ్గించేందుకు ఆస్కారం కల్పించినట్లయ్యింది. ఇది పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. దీనికితోడు విదేశీ కొనుగోళ్లూ కలిసొచ్చాయి. సెన్సెక్స్ 447.55 పాయింట్ల లాభంతో 84,929.36 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 585.69 పాయింట్ల మేర లాభపడింది. నిఫ్టీ 150.85 పాయింట్ల లాభంతో 25,966.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.66గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో భారత్ ఎలక్ట్రానిక్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్స్, ఏషియన్ పెయింట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌సీఈఎల్ టెక్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్‌క్రూడ్ బ్యారెల్ ధర 59.58 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4,325.19 వద్ద కొనసాగుతోంది.









# టీమ్‌ఇండియాదే పొట్టి సిరీస్

- వరుణ్ మ్యాజిక్‌తో సఫారీలు చిత్తు..
- చెలరేగిన పాండ్య, తిలక్..

**అహ్మదాబాద్ :** అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఐదో టీ20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ 30 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 20 ఓవర్లలో 231 పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో సఫారీ జట్టు 201 పరుగులు మాత్రమే చేయగలిగింది. వరుణ్ చక్రవర్తి (4/54) మ్యాజిక్‌తో దక్షిణాఫ్రికాను చిత్తు చేశాడు. ఐదు టీ20ల సిరీస్‌ను 3–1 తేడాతో టీమ్‌ఇండియా సొంతం చేసుకుంది. లఖ్‌నవూలో జరగాల్సిన నాలుగో మ్యాచ్ మంచు కారణంగా రద్దైన సంగతి తెలిసిందే. దీంతో వరుసగా 8 టీ20 సిరీస్‌లను టీమ్‌ఇండియా గెలుచుకోవడం విశేషం. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా హార్దిక్ పాండ్య, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా వరుణ్ చక్రవర్తి నిలిచారు.



### చెలరేగిన పాండ్య, తిలక్..

మంచు ప్రభావం కారణంగా లక్ష్య ఛేదన సులువుగా మారుతుంది. అందుకే టాస్ నెగ్గిన సఫారీ జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. స్కోరు బోర్డుపై భారీ టార్గెట్ ఉంచితేనే మ్యాచ్‌పై పట్టు సాధించే అవకాశం ఉందని మన బ్యాటర్లు ముందే గ్రహించారు. అందుకు తగినట్టుగానే పవర్ ప్లేలో టీమ్‌ఇండియా ఓపెనర్లు అభిషేక్ శర్మ (34), సంజు శాంసన్ (37) తొలి వికెట్‌కు 5.4 ఓవర్లలోనే 63 పరుగులు జోడించారు. గిల్ స్థానంలో వచ్చిన ఛాన్స్‌ను సంజు అద్భుతంగా ఒడిసిపట్టాడు. దూకుడుగా ఆడి పరుగులు రాబట్టాడు. అయితే, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (5) మరోసారి విఫలమయ్యాడు. కానీ, ఆ లోటును కనిపించకుండా తిలక్ వర్మ (73) హార్దిక్ పాండ్య (63) అదరగొట్టారు. నాలుగో వికెట్‌కు ఏకంగా 105 పరుగులు జోడించి భారత్‌కు భారీ స్కోరు అందించారు. ఈ క్రమంలో హార్దిక్ 16 బంతుల్లోనే రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీని నమోదు చేశాడు. శివమ్ దూబె (3 బంతుల్లో 10 పరుగులు) వచ్చీ రాగానే ఫోర్, సిక్స్ బాదాడు. సఫారీ బౌలర్లలో బాష్ 2, బార్ట్‌మన్, లిండే చెరో వికెట్ తీశారు.



### వరుణ్ దెబ్బకు..

దక్షిణాఫ్రికా ఆరంభం చూస్తే టీమ్‌ఇండియా నిర్దేశించిన 232 పరుగుల టార్గెట్ ఏమాత్రం సరిపోదేమో అనిపించింది. అద్భుత ఫామ్‌లో ఉన్న ఓపెనర్ క్వింటన్ డికాక్ (65) చెలరేగాడు. భారత టాప్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌ను టార్గెట్ చేస్తూ తొలి ఓవర్‌లోనే మూడు బౌండరీలు రాబట్టాడు. ఆ తర్వాత కూడా డికాక్ అదే దూకుడు కొనసాగించాడు. అయితే, పవర్ ప్లేలో అనూహ్యంగా వరుణ్‌ను కాదని వాషింగ్టన్ సుందర్‌తో కెప్టెన్ సూర్య మూడు ఓవర్లు వేయించాడు. అతడు కట్టడి చేయడంతో భారత్ ఊపిరి పీల్చుకోగలిగింది. లేకపోతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారేది. ఈ క్రమంలో బౌలింగ్‌కు వచ్చిన వరుణ్ తన తొలి ఓవర్‌లోనే వికెట్ తీసి టీమ్‌ఇండియాకు బ్రేక్ ఇచ్చాడు. రీజా హెండ్రిక్స్ (13)ను ఔట్ చేశాడు. అయితే, వచ్చీ రావడంతోనే టాప్ గేర్‌లో బ్యాటింగ్ చేసిన డేవాల్డ్ బ్రెవిస్ (31) డేంజరస్‌గా కనిపించాడు. హార్దిక్ పాండ్య వేసిన స్లో షార్ట్‌పిచ్ బంతికి బ్రెవిస్ దొరికిపోయాడు. బౌండరీ లైన్ వద్ద సుందర్ అద్భుతమైన క్యాచ్ పట్టాడు. మరోవైపు డికాక్ మాత్రం పరుగులు రాబడుతూనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే, వరుణ్ తన రెండో స్పెల్‌లో కీలకమైన ఐదెన్ మార్‌క్రమ్ (6), ఫెర్రీరా (0)ను వరుస బంతుల్లో ఔట్ చేయగా.. లిండే (16)ను కూడా పెవిలియన్‌కు పంపి భారత్ విజయావకాశాలను మెరుగుపర్చాడు. కీలకమైన డికాక్‌ను బుమ్రా రిటర్న్ క్యాచ్‌తో ఔట్ చేసి సఫారీలను దెబ్బకొట్టాడు. ఆఖర్లో మార్కో యాన్సన్ (14), బాష్ (17) కాస్త పోరాడినా తమ జట్టును గెలిపించుకోలేకపోయారు. భారత బౌలర్లలో వరుణ్ 4, బుమ్రా 2.. అర్ష్‌దీప్, పాండ్య చెరో వికెట్ తీశారు.

## అండర్-19 ఆసియా కప్ ఫైనల్‌కు భారత్

**దుబాయి:** ఆసియాకప్ అండర్ 19 కప్ టోర్నీలో భాగంగా శ్రీలంకతో జరిగిన సెమీస్ 1లో భారత్ ఘన విజయం సాధించి ఫైనల్‌లోకి అడుగుపెట్టింది. శ్రీలంక నిర్దేశించిన 139 పరుగుల లక్ష్యాన్ని యంగ్ ఇండియా 18 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్లు ఆయుష్(7), వైభవ్ సూర్యవంశీ(9) విఫలమైనా.. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన విహాన్(61), ఆరోన్(54) అర్ధశతకాలతో అదరగొట్టడంతోపాటు జట్టును గెలిపించారు. రెండో సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై పాక్ విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. దీంతో డిసెంబర్ 21న దుబాయ్ వేదికగా ఇండియా, పాక్‌ల మధ్య ఫైనల్ జరగనుంది.



## టాప్ ప్లేస్‌ను మిస్ అయ్యానని అనుకొన్నా: హార్దిక్

భారత్ తరఫున టీ20ల్లో రెండో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీని హార్దిక్ పాండ్య నమోదు చేశాడు. మరి దీనిపై హార్దిక్ పాండ్య ఫస్ట్ రియాక్షన్ ఎలా ఉంటుందో ఓ సారి అంచనా వేయండి. ఎందుకంటే ఈ ఘనత యువరాజ్ సింగ్ (12 బంతుల్లో) పేరిట ఉంది. అతడిపై ఉన్న గౌరవాన్ని చెబుతూనే టాప్ ప్లేస్‌ను మిస్ అయినట్లు తన టీమ్‌తో చెప్పాడు. దక్షిణాఫ్రికాతో ఐదో టీ20లో 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన హార్దిక్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఈ సందర్భంగా పాండ్య మాట్లాడాడు. "జట్టు విజయాల్లో మన భాగస్వామ్యం ఉంటే ఆ ఆనందమే వేరు. టీ20ల్లో భారత్ తరఫున రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ చేశానని నాకు తొలుత తెలియదు. డగౌట్‌కు వెళ్లాక సోషల్ మీడియా సహచరులు చెప్పారు. అప్పుడు నేను ' అరే.. టాప్ ప్లేస్‌ను మిస్ అయ్యానే' అనుకున్నా. కానీ, ఆ రికార్డు ఇప్పటికీ యువీ పాజీ పేరిటే ఉండటం ఆనందంగా ఉంది. ఈ మ్యాచ్‌లో నేను తొలి బంతి నుంచే దూకుడుగా ఆడతానని ముందే సహచర బ్యాటర్‌కు చెప్పా. సిక్స్ కొట్టడంతో నా కాన్ఫిడెన్స్ పెరిగింది. ఇలాంటి పరిస్థితులు నాకు చాలా సూట్ అవుతాయి. అందుకోసం చాలా శ్రమించా అని హార్దిక్ వ్యాఖ్యానించాడు.




## శ్రీరామ్ ఫైనాన్స్‌లో జపాన్ బ్యాంక్‌కు 20% వాటా

**దిల్లీ:** ఆర్థిక సేవల రంగంలో మరో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి తరలివస్తోంది. ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ శ్రీరామ్ ఫైనాన్స్‌లో జపాన్‌కు చెందిన ఎంయూఎఫ్‌జీ బ్యాంక్ రూ.39,168 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ మేరకు 20 శాతం వాటా ఆ కంపెనీకి విక్రయించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఒప్పందంలో భాగంగా ప్రిఫరెన్షియల్ ఈక్విటీ షేర్లను శ్రీరామ్ ఫైనాన్స్ జారీ చేయనుంది. దీంతో ఎంయూఎఫ్‌జీ బ్యాంక్‌కు 20 శాతం వాటా లభిస్తుందని శ్రీరామ్ ఫైనాన్స్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. భారతదేశ రుణ, ఆర్థిక సేవల భవిష్యత్ వృద్ధి సామర్థ్యంపై నమ్మకాన్ని ఈ డీల్ తెలియజేస్తోందని శ్రీరామ్ ఫైనాన్స్ ఓ ప్రకటనలో పేర్కొంది. శ్రీరామ్ ఫైనాన్స్ క్యాపిటల్ బేస్‌ను బలోపేతం చేయడంతో పాటు, వృద్ధిని వేగవంతం చేయడానికి ఈ డీల్ దోహదం చేస్తుందని తెలిపింది. వాటాదారులు, నియంత్రణ సంస్థలు ఆమోదం తెలపాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ భాగస్వామ్యం వల్ల టెక్నాలజీ, ఇన్నోవేషన్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్ విషయంలో సుస్థిర వృద్ధి సాధ్యమవుతుందని తెలిపింది. ఇటీవల కాలంలో దేశీయ ప్రైవేటు బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లోకి పెద్ద మొత్తంలో విదేశీ పెట్టుబడులు తరలివస్తున్నాయి. పలు సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టగా.. మరికొన్ని ఒప్పందాలు చేసుకున్నాయి. జపాన్‌కు చెందిన ఎస్ఎంబీసీ యెస్ బ్యాంకులో 24 శాతంబీ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో వార్‌బర్గ్ పింకస్, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ వాటా దక్కించుకున్నాయి. ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు ఎమిరేట్స్ ఎన్‌బీడీ ముందుకురాగా.. ఫెడరల్ బ్యాంకులో న్యూయార్క్‌కు చెందిన బ్లాక్‌స్టోన్ కంపెనీ 9.99 శాతం వాటా కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో శ్రీరామ్ ఫైనాన్స్‌లోనూ ఎంయూఎఫ్‌జీ రూపంలో అతిపెద్ద ఎఫ్‌డీఐ తరలిరావడం విశేషం.



## భారత్‌కు భారీగా 'చైనా సరకు'..

### వాణిజ్యలోటు 100 బిలియన్ డాలర్ల పైనే..

**దిల్లీ:** భారత్–చైనా మధ్య వాణిజ్య అంతరం నానాటికీ పెరుగుతోంది. ఓవైపు బీజింగ్ నుంచి మన దేశానికి దిగుమతులు భారీగా ఉంటుండగా.. భారత్ నుంచి చైనాకు ఎగుమతులు మాత్రం చాలా తక్కువస్థాయిలో ఉన్నాయి. దీంతో ఈ ఏడాది చైనాతో మన వాణిజ్యలోటు 106 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) అంచనా వేసింది. చైనా నుంచి అత్యధికంగా ఎలక్ట్రానిక్స్, మెషినరీ, ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్ సంబంధ దిగుమతులు పెరుగుతున్నట్లు తెలిపింది.

### జీటీఆర్ఐ నివేదికలో కీలక అంశాలివే..

- 2021లో భారత్‌లోకి చైనా దిగుమతుల విలువ 87.7 బిలియన్ డాలర్లు ఉండగా.. గతేడాది 109.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. 2025లో ఆ దిగుమతుల విలువ ఏకంగా 123.5 బిలియన్ డాలర్లు ఉండొచ్చని అంచనా.
- ఇక, 2021లో చైనాకు మన దేశం నుంచి ఎగుమతి చేసిన వస్తువుల విలువ 23 బిలియన్ డాలర్లు ఉండగా.. గతేడాది నాటికి ఆ మొత్తం 15.1 బిలియన్ డాలర్లకు పడిపోయింది. 2025లో ఎగుమతుల విలువ స్వల్పంగా పెరిగి 17.5 బిలియన్ డాలర్లకు చేరొచ్చని జీటీఆర్ఐ అంచనా వేసింది. అయితే, గతంతో పోలిస్తే ఈ విలువ చాలా తక్కువే.

### ఒమన్‌తో ఒప్పందం.. ఇదీ లాభం

ఎగుమతులు తగ్గుతుండటంతో చైనాతో భారత్‌కు వాణిజ్య లోటు భారీగా ఉంటోంది. 2021లో భారత వాణిజ్య అంతరం 64.7 బిలియన్ డాలర్లుగా ఉండగా.. గతేడాది 94.5 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ ఏడాది వాణిజ్య లోటు 106 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా.
ఈ ఏడాది జనవరి–అక్టోబరు మధ్య చైనా నుంచి అత్యధికంగా ఎలక్ట్రానిక్స్ సంబంధిత పరికరాలు, ఉపకరణాలు దిగుమతి అయ్యాయి. వీటి విలువ 38 బిలియన్ డాలర్ల పైనే ఉంది. ఇందులో మొబైల్ ఫోన్ కాంపోనెంట్స్ (8.6 బిలియన్ డాలర్లు), ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ (6.2 బిలియన్ డాలర్లు), ల్యాప్‌టాప్‌లు (4.5 బిలియన్ డాలర్లు), సోలార్ సెల్స్, లిథియం అయాన్ బ్యాటరీలు వంటివి ఉన్నాయి.
ఇక, నవంబరులో చైనాకు 2.2 బిలియన్ డాలర్ల వస్తువులు మన దేశం నుంచి ఎగుమతి అయ్యాయి. ఏప్రిల్–నవంబరు మధ్య మొత్తం ఎగుమతుల విలువ 12.2 బిలియన్ డాలర్లుగా ఉంది. ప్లాస్టిక్ పరిశ్రమలో ఉపయోగించే నాఫ్తాను ఎక్కువగా ఎగుమతి చేయడంతో.. ఈ ఏడాది పొరుగు దేశానికి మన ఎగుమతుల విలువ స్వల్పంగా పెరిగిందని జీటీఆర్ఐ తెలిపింది.

## ఎడాపెడా హ్యాష్‌ట్యాగ్‌లు ఇక కుదరవ్

### వాడకంపై ఇన్‌స్టా పరిమితి



ఇన్‌స్టాగ్రామ్‌లో ఎక్కువ రీచ్ కోసం చాలామంది రీల్స్, పోస్టులకు ఎడాపెడా హ్యాష్‌ట్యాగ్‌లు పెట్టేస్తుంటారు. తమ పోస్ట్ ఎక్కువమందికి రీచ్ అవ్వాలన్న ఉద్దేశంతో కంటెంట్‌తో సంబంధం లేకుండా ట్రెండింగ్‌లో ఉన్న హ్యాష్ ట్యాగ్‌లు జోడిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్ కీలక నిర్ణయం తీసుకుంది. హ్యాష్‌ట్యాగ్‌ల వినియోగంపై పరిమితి విధించింది. ఇకపై రీల్స్‌కు గానీ, పోస్ట్‌కు గానీ గరిష్ఠంగా ఐదు మాత్రమే వినియోగించేలా పరిమితి తీసుకొచ్చింది. కంటెంట్ డిస్కవర్ కోసం 2011లో తొలిసారి హ్యాష్‌ట్యాగ్‌లను ఇన్‌స్టాగ్రామ్ ప్రవేశపెట్టింది. టాపిక్ బేస్డ్ సెర్చ్‌ను మెరుగుపరచడం, అల్గారిథమ్ ఆధారిత కంటెంట్ రికమెండేషన్ కోసం హ్యాష్‌ట్యాగ్‌లను అనుమతిస్తూ వస్తోంది. ప్రస్తుతం ఒక్కో పోస్ట్‌కు గరిష్ఠంగా 30 హ్యాష్‌ట్యాగ్‌లు జోడించే అవకాశం కల్పిస్తోంది. ఇదే అదునుగా ట్రెండింగ్‌లోని హ్యాష్‌ట్యాగ్‌ల ను కొందరు జోడిస్తుండంతో వీటి వినియోగంపై పరిమితి విధిస్తున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ప్రకటించింది. ఇకపై గరిష్ఠంగా ఐదు హ్యాష్‌ట్యాగ్‌లను మాత్రమే అనుమతిస్తామని ఇన్‌స్టా శుక్రవారం స్పష్టం చేసింది. జనరిక్ హ్యాష్‌ట్యాగ్‌లు కాకుండా టార్గెటెడ్‌వి వినియోగించడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుందని కంటెంట్ క్రియేటర్లకు సూచించింది. ఉదాహరణకు బ్యూటీ కంటెంట్‌ను పోస్ట్ చేసేవారు అందుకు తగిన హ్యాష్‌ట్యాగ్‌లను మాత్రమే వాడాలని సూచించింది. చరీల్స్, చఎక్స్‌ప్లోర్ వంటి జనరిక్ హ్యాష్‌ట్యాగ్‌లను వినియోగించడం వల్ల ప్రయోజనం ఉండదని స్పష్టం చేసింది. ఇన్‌స్టాలో కంటెంట్ రీచ్ లేదా విజిబిలిటీకి హ్యాష్‌ట్యాగ్ అనేది ప్రామాణికం కాదని ఇప్పటికే ఇన్‌స్టాగ్రామ్ హెడ్‌ఆడమ్ మొస్సేరి తెలిపారు.



# భయంతో గదిలో నుంచి బయటకు రాలేదు

## కల్యాణి ప్రియదర్శన్

2025లో బాగా వినిపించిన సినిమా పేర్లలో 'కొత్తలోక: చాప్టర్1' ముందువరుసలో ఉంటుంది. భాషతో సంబంధం లేకుండా ఆదరణను సొంతం చేసుకొని అత్యధిక కలెక్షన్లతో సరికొత్త రికార్డులు సృష్టించింది. ఈ సినిమా విడుదలకు ముందు తానెంతో భయపడినట్లు ఇందులో ప్రధాన పాత్రలో నటించిన కల్యాణి తాజాగా ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. "నన్ను సూపర్ హీరోగా ప్రేక్షకులు అంగీకరిస్తారో, లేదోనని భయపడ్డాను. రివ్యూలు వచ్చే వరకూ భయంతో గదిలో నుంచి బయటకు కూడా రాలేదు. నేను కాదు.. మా చిత్ర బృందం మొత్తం అలానే టెన్షన్ పడ్డాం. మేం ఎంత భయపడ్డామో అంత పాజిటివ్ స్పందన వచ్చింది. రివ్యూలు చదవగానే మా ఆందోళన మొత్తం మాయమైంది. రెస్పాన్స్ ఎలా ఉన్నా.. విమర్శలు రాకుండా ఉంటే చాలని భావించాం. మధ్యాహ్నం 3 తర్వాత అందరం గదిలో నుంచి బయటకు వచ్చి సంబరాలు చేసుకున్నాం" అని కల్యాణి ప్రియదర్శన్ తెలిపారు. చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాసింది 'కొత్తలోక: చాప్టర్ 1'. కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిందీ సినిమా. ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్లకు పైగా వసూలుచేసింది. అంతేకాదు, అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఈ చిత్రం 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది.

# దరుంధర్ కలెక్షన్ల వర్షం

## నెట్‌ఫ్లిక్స్‌లో భారీ ఆఫర్



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, 'ఉరి' ఫేమ్ ఆదిత్య ధార్ దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఒకవైపు థియేటర్‌లలో ఈ చిత్రం దూసుకుపోతుండగా.. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించి ఒక భారీ డీల్ కుదిరినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా కోసం ఏకంగా రూ. 285 కోట్లు చెల్లించినట్లు టాక్ నడుస్తోంది. ఇది 'పుష్ప 2' ఓటీటీ డీల్ కంటే ఎక్కువ అని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. థియేటర్లలో విడుదలైన 8 వారాల తర్వాత, అంటే 2026 జనవరి 30న లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల అయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉండటంతో, ఈ డీల్ రెండు భాగాలకు కలిపి జరిగిందా లేక మొదటి భాగానికే ఇంత భారీ మొత్తం ఇచ్చారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. డిసెంబర్ 5న విడుదలైన ఈ చిత్రం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించింది. ఫుల్ రన్ ముగిసే సమయానికి రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరుతుందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రణవీర్ సింగ్, ఆర్. మాధవన్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. 'ధురంధర్: రివెంజ్' పేరుతో పార్ట్ 2 వచ్చే ఏడాది మార్చి 19, 2026న విడుదల కానుంది.

# అవతార్ 3.. ఫైర్ అండ్ యాష్

## అక్కడక్కడా ఆకట్టుకునే అగ్ని యుద్ధం



రివ్యూ

ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూసిన సినిమా 'అవతార్ ఫైర్ అండ్ యాష్'. అవతార్ ఫ్రాంచైజీలో భాగంగా వచ్చిన మూడో సినిమా ఇది. రెండో భాగం 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' సంఘటనల తర్వాత జేక్ సల్లీ (శ్యామ్ వర్తింగ్టన్), నేతిరి (జో సల్డానా) జంట తమ పెద్ద కొడుకును కోల్పోయిన బాధలో ఉంటారు. వారి పిల్లలైన కిరి (సిగొర్నీ వీవర్), లోక్ (బ్రిటన్ డాల్టన్), టూక్ (ట్రినిటీ జో–లి బ్లిస్)తోపాటు దత్త పుత్రుడు లాంటి స్పైడర్ (జాక్ ఛాంపియన్)తో కలిసి జీవిస్తుంటారు. లోక్ కూడా తన వల్లే సోదరుడు మరణించాడనే అపరాధ భావంతో ఉంటాడు. రెండో భాగంలోనే మరణించిన కల్నల్ క్వారిచ్ (స్టీఫెన్ లాంగ్).. నావీ తెగకు చెందిన వ్యక్తిలా మళ్లీ జీవం పోసుకొని సల్లీపై ప్రతీకారానికి దిగుతాడు. అతడికి ఈసారి అగ్ని తెగకు చెందిన నాయకురాలు వరంగ్ (ఊనా చాప్లిన్) తోడవుతుంది. సల్లీ కుటుంబం విశ్వసించే ఈవా దేవతపై కోపంతో రగిలిపోతుంటుంది వరంగ్. కల్నల్ క్వారిచ్ నుంచి అత్యాధునికమైన ఆయుధాల్ని ఎలా వాడాలో వరంగ్ తెలుసుకుంటుంది. అలా ఆ ఇద్దరు శత్రువులు కలిసి సల్లీ కుటుంబంపైనా, పండోరా గ్రహంలో ఉన్న ఇతర తెగలపైనా అగ్గి పిడుగులు కురిపించాలని నిర్ణయిస్తారు. మరోవైపు పండోరాని నాశనం చేయాలనే లక్ష్యంతో ఉన్న ఆర్డీఏ బృందం కూడా వీళ్లకు తోడవుతుంది. అంతమంది శత్రువుల్ని జేక్ సల్లీ కుటుంబం ఎలా ఎదుర్కొంది? చివరికి ఎవరు పైచేయి సాధించారన్నది తెరపై చూసి తెలుసుకోవాల్సిందే .

### ఎలా ఉందంటే?

అవతార్ సినిమా అనగానే అందమైన పండోరా గ్రహం, చూడటానికి రెండు కళ్లు చాలవనిపించే ఆ విజువల్సే గుర్తొస్తాయి. ది వే ఆఫ్ వాటర్ అంటూ రెండో భాగాన్ని నీటి ప్రపంచం వైపు తీసుకెళ్లి... తొలి భాగం కంటే భిన్నమైన విజువల్స్‌ని ఆవిష్కరించి ప్రేక్షకుల్ని కట్టిపడేశారు జేమ్స్ కామెరూన్. మూడో చిత్రంలో అగ్నియుద్ధం కోణాన్ని ఆవిష్కరించారు. ఈసారి కూడా విజువల్స్ అదుతేం అనిపించే స్థాయిలోనే ఉంటాయి. కానీ ప్రేక్షకులు తొలి రెండు సినిమాల స్థాయిలో అబ్బురపడి చూసేలా అయితే ఉండవు. ఇంతకుముందు చూసిన సన్నివేశాల్నే మళ్లీ తెరపై చూసిన అను భూతి కలుగుతుంది. కొన్ని యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. స్పైడర్ పాత్ర నేపథ్యంలో కొన్ని భావోద్వేగ సన్నివేశాలు మనసుల్ని హత్తుకుంటాయి. వరంగ్, కిరి పాత్రల నేపథ్యంలో సన్నివేశాలు ఈ సినిమాకి కాస్త కొత్తదనాన్ని తీసుకొచ్చాయి. ఈవా దేవతతో ఆ పాత్రల్ని ముడిపెట్టిన తీరు, ఆపదలో ఉన్న స్పైడర్‌ని ఈవా దేవత సాయంతో కిరి గట్టెక్కించే సన్నివేశాలు, కల్నల్ క్వారిచ్, వరంగ్ కలిసే సన్నివేశాలు ఈ సినిమాలో మంచి డ్రామా పండిస్తాయి. ఆర్డీఏ చెర నుంచి జేక్ సల్లీ తప్పించుకునేందుకు చేసే పోరాట ఘట్టాలు కూడా ఉత్కంఠ రేకెత్తిస్తాయి. కల్నల్ క్వారిచ్, వరంగ్ పాత్రల కలయికతోనే ఈ సినిమా కథ దాదాపుగా పూర్తయిపోతుంది. ఆ తర్వాత సన్నివేశాలన్నీ ప్రేక్షకుడి ఊహకు తగ్గట్టుగానే సాగుతుంటాయి. పతాక సన్నివేశాలు సినిమాకి హైలైట్‌గా నిలుస్తాయి. యాక్షన్ ప్రధానంగా సాగే విజువల్స్ కట్టిపడేస్తాయి. మొత్తంగా ఫ్రాంచైజీలో భాగంగా వచ్చే సినిమాలకు కథలో కొత్త సంఘర్షణలు చాలా అవసరం అని మరోసారి నిరూపిస్తుందీ చిత్రం.

### ఎవరెలా చేశారంటే?

ఈ సినిమాపై నటీనటుల ప్రభావం బలంగా కనిపిస్తుంది. కథానాయకుడు జేక్స్ సల్లీ పాత్రలో సామ్ వర్తింగ్టన్ కనిపించిన తీరు, అభినయం మెప్పిస్తుంది. జో సల్డానా పాత్రని డిజైన్ చేసిన విధానం బాగుంది. స్పైడర్ విషయంలో ప్రథమార్ధంలో ఆమె కోణం ఒకలా ఉన్నా, ద్వితీయార్థంలో ఆ పాత్రలో వచ్చే మార్పు ఆకట్టుకుంటుంది. స్టీఫెన్ లాంగ్, ఊనా చాప్లిన్ పాత్రలు సినిమాకి హైలైట్. ముఖ్యంగా వరంగ్ పాత్రలో ఊనా చాప్లిన్ నటన అందరినీ ఆశ్చర్య పరిచేలా ఉంటుంది. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. సైమన్ ఫ్రాంగ్లెన్ సంగీతం, రస్సెల్ కార్పెంటర్ సినిమాటోగ్రఫీ సినిమాకి బలాలు. ముఖ్యంగా త్రీడీలో సన్నివేశాలు పైసా వసూల్ అనిపిస్తాయి. దర్శకుడు జేమ్స్ కామెరూన్ మరోసారి అవతార్ బలమైన దృశ్య ప్రపంచం పైనే దృష్టిపెట్టారు. కథ, భావోద్వేగాల పైనా ఆయన ప్రభావం కనిపిస్తుంది.

# సనాతన ధర్మం కాపాడుకోవడం అందరి బాధ్యత

## కాశీ విశ్వేరుడిని దర్శించుకున్న బాలయ్య, బోయపాటి



వారణాసిలోని కాశీ విశ్వనాథ స్వామిని అఖండ–2 బృందం దర్శించుకుంది. నటుడు నందమూరి బాలకృష్ణ దర్శకుడు బోయపాటి కలసి కాశీని సందర్శించారు. అఖండ 2' చిత్రానికి వస్తున్న అపూర్వ స్పందన నేపథ్యంలో చిత్రయూనిట్‌తో కలిసి బాలయ్య ఆధ్యాత్మిక నగరమైన కాశీకి వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. నేటి తరం సనాతన ధర్మం గొప్పతనాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. 'అఖండ 2' సినిమాలో తాను సనాతన సైనికుడిగా నటించానని, ఆ పాత్ర తనకు ఎంతో ఆత్మసంతృప్తిని ఇచ్చిందని బాలకృష్ణ వెల్లడించారు. ఈ సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన వస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను నిర్మాతలు, దర్శకుడు కలిసి కలసి సినిమా గురించి వివరించారని బాలయ్య పేర్కొన్నారు. సినిమా సందేశం, సనాతన ధర్మంపై ఉన్న అంశాలు ఆయనను ఆకట్టుకున్నాయని చెప్పారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన 'అఖండ 2' భారీ అంచనాల మధ్య డిసెంబర్ 12న థియేటర్లలోకి వచ్చింది. విడుదలైన తొలి రోజునుంచే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. బాలకృష్ణ అఘోరగా కనిపించిన లుక్, పవర్‌ఫుల్ డైలాగ్స్, మాస్ ఎలివేషన్లు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఫస్ట్ వీక్‌లోనే గట్టి వసూళ్లు సాధించిన ఈ చిత్రం, ఇప్పుడు కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ విజయవంతంగా రన్ అవుతోంది. ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట కలిసి నిర్మించారు. ఎస్.ఎస్. థమన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. సంయుక్త మీనన్, హర్షాలీ మల్హోత్ర కీలక పాత్రల్లో నటించి కథకు మరింత బలం చేకూర్చారు. 'అఖండ 2' విజయం నేపథ్యంలో కాశీలో స్వామివారి దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, ఈ సినిమా తన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని బాలకృష్ణ తెలిపారు. ఇది కేవలం తెలుగు సినిమా కాదని, భారతీయులందరి చిత్రమని పేర్కొన్నారు. మంచి సినిమా కోసం చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పటికే హైదరాబాద్‌లో సక్సెస్ ఈవెంట్ నిర్వహించిన టీమ్ ఇప్పుడు ఉత్తరాదిలో సినిమాని ప్రమోట్ చేస్తోంది.



# నిధి అగర్వాల్ పట్ల అనుచిత ప్రవర్తన

## దర్యాప్తు చేపట్టిన పోలీసులు

నిధి అగర్వాల్ గత కొన్ని రోజులుగా టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన పేరు. ఇటీవల హైదరాబాద్‌లోని లూలు మాల్‌లో 'రాజాసాబ్' సినిమా సాంగ్ ప్రమోషన్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమెకు ఎదురైన చేదు అనుభవం ఇప్పుడు పెద్ద చర్చకు దారి తీసింది. ప్రమోషన్ ఈవెంట్‌కు భారీగా తరలివచ్చిన అభిమానులు నిధి దగ్గరకు చేరుకునేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి అదుపు తప్పింది. కొందరు హద్దులు దాటి ప్రవర్తించడంతో నిధి తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు సమాచారం. ఈ ఘటన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మహిళల భద్రతపై మరోసారి ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. పరిస్థితి తీవ్రతను గమనించిన బాడీగార్డులు వెంటనే రంగంలోకి దిగడంతో నిధిని అక్కడి నుంచి సురక్షితంగా బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నిధి అగర్వాల్‌కు సంబంధించిన పాత వీడియోలు, ఇంటర్వ్యూల్లో చేసిన వ్యాఖ్యలు నెట్టింట మళ్లీ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఆమె గతంలో కాస్టింగ్ కౌచ్ అంశంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.ఓ ఇంటర్వ్యూలో నిధి మాట్లాడుతూ, సినిమా పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ అనేది 'రాక్షసి లాంటిదని' పేర్కొన్నప్పటికీ, అది తనకు వ్యక్తిగతంగా ఎదురుకాలేదని చెప్పింది. అలాంటి పరిస్థితి వస్తే చాలా బాధగా అనిపిస్తుందని ఆమె స్పష్టం చేసింది. ఇప్పుడు లూలు మాల్ ఘటన తర్వాత ఆమె అప్పటి వ్యాఖ్యలు మరోసారి వెలుగులోకి రావడంతో, అభిమానులు మరియు నెటిజన్లు నిధికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం నిధి అగర్వాల్ డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'రాజాసాబ్'లో కథానాయికగా నటిస్తోంది.

# ఓ మంచి సినిమా ప్రయత్నంలో ఉన్నాం

## డెకాయిట్‌పై అడవి శేష్ కామెంట్



ఆలస్యమైనా ప్రేక్షకులకు మంచి సినిమా అందించాలన్నదే నా తపన. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న 'డెకాయిట్' విషయంలో మేమంతా గర్వపడుతున్నాం అని అడివి శేష్ అన్నారు. ఆయన కథానాయకుడిగా... షానియల్ డియో దర్శకత్వంలో రూపొందుతున్న సినిమానే 'డెకాయిట్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కథానాయకుడు అడివి శేష్ మాట్లాడుతూ ఎక్కడికి పోయాడు? ఏం చేస్తున్నాడు? అంటూ నా గురించి ఎక్స్‌లో చర్చ జరుగుతోంది. నేను ఎక్కడికీ పోలేదు. ఈ సినిమానే చేస్తున్నా. ఇలా చాలా పెద్ద సినిమా. తెలుగు, హిందీ భాషల్లో చేశాం. నేను, షానియల్ కలిసి రాశాం. అనురాగ్ కశ్యప్ మాకు మార్గనిర్దేశనర చేశారు. మృణాల్ అద్భుతమైన నటనని ఇందులో చూస్తారు. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందడానికి కారణం నిర్మాత సుప్రియ. సునీల్, జాన్వి ఈ సినిమాని మరింత ముందుకు తీసుకెళుతున్నారు. ప్రేక్షకుల మనసుల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్రల్లో నటించడమే నా లక్ష్యం అని అన్నారు. మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ నా మనసుకు దగ్గరైన సినిమా ఇది. హృదయం పెట్టి పనిచేశా. 'సీతారామం' సినిమాని స్వప్నతో, ఇప్పుడు సుప్రియ... మహిళా నిర్మాతలతో కలిసి సినిమా చేయడం చాలా బాగుంది. శేష్ పాత్ర చాలా బాగుంటుంది. ఈ సినిమాకోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 14ఏళ్ల కిందట కాలిఫోర్నియాలో శేష్ అన్నను కలిసినప్పుడు ఒక కథ గురించి మాట్లాడుకున్నాం. అక్కడ మొదలైన ప్రయాణం ఈ సినిమా వరకూ చేరింది. నేను ఈ దేశంలో ఉండటానికి కారణం ఆయనే. ఆయన మార్గనిర్దేశకత్వరలోనే ఈ సినిమా చేశానని అన్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com